

గెస్ట్ లెక్చరర్ల నియామకానికి దరఖాస్తుల స్వీకరణ

అనకాపల్లి, జూలై 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గెస్ట్ లెక్చరర్ల నియామకానికి అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఎం.వినోద్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. వి.మాడుగుల, దేవరాపల్లి జూనియర్ కళాశాలల్లో కెమిస్ట్రీ సబ్జెక్టు, చోడవరం, దేవరాపల్లి, కోటవురట్ల కళాశాలల్లో ఒకేషనల్, సబ్బవరం కళాశాలలో ఫిజియోథెరపీ సబ్జెక్టులు బోధించేందుకు గెస్ట్ లెక్చరర్లు కావాలని పేర్కొన్నారు. ఈ నెల 16వ తేదీలోగా ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో సంబంధిత జూనియర్ కళాశాలలకు హాజరుకావాలని కోరారు.

దారికొస్తున్న బీఎన్ రోడ్డు

ఎట్టకేలకు గోతుల పూడ్చివేత మొదలు

రహదారి దుస్థితిపై కోర్టులో కేసులు, కూటమి నేతల ఒత్తిడితో పనులకు కదలిక

- వాహనదారులకు ఊరట



లక్ష్మీపురం కళ్లాల వద్ద బీఎన్ రోడ్డులో గోతులు (ఫైల్)



గోతులు పూడ్చిన తరువాత ఇలా..

చోడవరం, జూలై 14(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని బీఎన్ రోడ్డులో ఎట్టకేలకు గోతుల పూడ్చివేత కార్యక్రమం ప్రారంభమైంది. ఈ రోడ్డు దుస్థితిపై పలువురు కోర్టులో కేసులు వేయడం, కూటమి ప్రజాప్రతినిధుల నుంచి ఒత్తిడి రావడంతో పనులకు కదలిక వచ్చింది. గోతుల పూడ్చివేత పనులు ప్రస్తుతం జోరుగా సాగుతున్నాయి.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రహదారి పనులు ప్రారంభమై బిల్లులు మంజూరుకాక అర్థాంతరంగా నిలిచిపోయాయి. మండలంలోని చోడవరం- అనకాపల్లి రోడ్డులోని గంధవరం నుంచి నర్సీపట్నం శివారు రోలుగుంట వరకు రోడ్డు పూర్తిగా గోతులమయంగా తయారుకావడంతో వాహనాలు ప్రయాణించడానికి కూడా వీల్లేని విధంగా పరిస్థితి మారింది. రావికమతం మండలం మేడివాడ వద్ద తరచూ ఆటోలు, జీపులు ఇతర లారీలు, బస్సులు కూరుకుపోవడం, ఎక్స్‌కవేటర్లతో బయటకు లాగడం వంటి ఘటనలు సర్వసాధారణంగా మారిపోయాయి. ఇక బుచ్చెయ్యపేట మండలం బంగారుమెట్ట నుంచి వడ్డాది, వడ్డాది నుంచి చోడవరం మండలం వరకు విజయరామరాజుపేట, లక్ష్మీపురం కళ్లాలు, గోవాడ, అంభేరుపురం, వెంకన్నపాలెం జంక్షన్ల వద్ద రోడ్డు దారుణంగా తయారైంది. తరచూ ఈ రోడ్డులో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రోడ్డు దుస్థితి మెరుగుపరచాలని, కనీసం గోతులైనా పూడ్చాలని స్థానిక నాయకులు, వివిధ వర్గాల ప్రజలు వేడుకున్నా ఫలితం లేకపోయింది. ఈ రోడ్డు పనులు చేపట్టాలంటూ స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, మాడుగుల ఎమ్మెల్యే బండారు, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్‌తో పాటు జనసేన నేతలు కూడా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ రోడ్డు దుస్థితిపై ఇటీవల స్థానిక న్యాయవాదులు కోర్టులో కేసు వేయడం, దీనిపై కోర్టు కలెక్టర్, ఆర్అండ్‌బీ ఉన్నతాధికారులను ఈ నెల 26న కోర్టుకు హాజరుకావాలని నోటీసులు ఇవ్వడం సంచలనం రేపింది. ఇదే సమయంలో బీఎన్ రోడ్డు పరిస్థితిపై స్థానిక స్వచ్ఛంద సంస్థలు, ఇతర న్యాయవాదులు కూడా మరో నాలుగు కేసులు వేయడంతో ఈ రోడ్డుపై దాఖలైన కేసుల సంఖ్య ఐదుకి చేరింది. ఇలా అన్ని వర్గాల నుంచి తీవ్ర విమర్శలు, కూటమి నేతలు, ప్రజాప్రతినిధుల నుంచి కూడా ఒత్తిడి పెరిగిన నేపథ్యంలో బీఎన్ రోడ్డు పనుల్లో కదలిక వచ్చింది. ప్రస్తుతం ప్రధాన గోతులన్నీ గత రెండు రోజులుగా పూడుస్తున్నారు. వడ్డాది జంక్షన్ నుంచి రావికమతం వరకు, అలాగే వడ్డాది నుంచి చోడవరం వరకు గల పెద్ద గోతుల్లో మెటల్ వేసి రోలర్‌తో చదును చేస్తున్నారు. దీనిపై సిమెంట్ పూత వేస్తారని అధికారులు చెబుతున్నారు. ఈ రోడ్డులో పెద్ద గుంతలను తాత్కాలికంగానైనా కప్పుతుండడంతో వాహనదారులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వర్షా కాలం కావడంతో ఈ పూడ్చివేత పనులు తాత్కాలికంగా కాకుండా, రోడ్డు పనులు పూర్తయ్యే వరకు నిలిచేలా పక్కాగా ఉండేలా చేయాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.



చోడవరం- బొడ్డేరు వంతెన మార్గంలో గొయ్యి (ఫైల్)



గొయ్యి పూడ్చిన తరువాత..



విశాఖలోని డీసీసీబీ కార్యాలయం

పీఏసీఎస్‌లకు పర్సన్ ఇన్‌చార్జుల నియామకం

నర్సీపట్నం, జూలై 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(పీఏసీఎస్) పర్సన్ ఇన్‌చార్జులను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. జిలాలోని 74 పీఏసీఎస్‌లకు గాను 16 సంఘాలకు పీఏసీఎస్ చైర్‌పర్సన్, సభ్యులను నియమించింది. పూర్వం పీఏసీఎస్‌లకు ఎన్నికలు నిర్వహించి అధ్యక్షులను ఎన్నుకునేవారు. 2012-13 సంవత్సరం నుంచి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించడం లేదు. అప్పటి నుంచి ప్రభుత్వం నామినేట్‌గా చైర్‌పర్సన్, సభ్యుల నియామకం చేపడుతోంది. కొరుప్రోలు పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా గుర్రం వెంకటరామకృష్ణ, సభ్యులుగా డి.రమాదేవి, కోన అప్పరాజును నియమించింది. నక్కపల్లి చైర్‌పర్సన్‌గా కొప్పిశెట్టి వెంకటరమణ, సభ్యులుగా కోసూరి శ్రీనివాసరావు, మనబాల కొండబాబు, నర్సీపట్నం చైర్‌పర్సన్‌గా రుత్తల కృష్ణ, సభ్యులుగా పొన్నాడ అప్పలకొండ, బయపురెడ్డి నూకరాజు, చెట్టుపల్లి చైర్‌పర్సన్‌గా అప్పికొండ రాజారావు, సభ్యులుగా పూడి వెంకట గణేశ్, కలిమి సత్తిబాబు, వేములపూడి చైర్‌పర్సన్‌గా బోళెం రాంప్రసాద్, సభ్యులుగా పైల గంగాధర్, నల్లబిల్లి నాగశివను నియమించింది. శృంగవరం చైర్‌పర్సన్‌గా సింగంపల్లి సన్యాసిదేవుడు, సభ్యులుగా బి.జ్యోతిబాబు, అంకంరెడ్డి రామకృష్ణ, నాతవరం చైర్‌పర్సన్‌గా ఆదిరెడ్డి మహాలక్ష్మి, సభ్యులుగా అప్పన్న సత్యనారాయణ, శెట్టినాగేశ్వరరావు, పీకేగూడెం చైర్‌పర్సన్ ఎ.సన్యాసయ్య, సభ్యులుగా గాడి లక్ష్మణరావు, చింతకాయల గంగరాజులను నియమించింది. మాకవరపాలెం

... మిగతా 6వ పేజీలో

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌ల మొరాయింపు

అరిగిపోయిన టైర్లతో అవస్థలు

- బ్యాటరీలు పని చేయక బండి కదలాలంటే నెట్టాల్సిన దుస్థితి
- మరమ్మతుల గురించి పట్టించుకోని నిర్వహణ సంస్థ



నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో నిలిచిపోయిన తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్

నర్సీపట్నం, జూలై 14(ఆంధ్రజ్యోతి): తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల నిర్వహణ దారుణంగా ఉంది. బ్యాటరీలు పనిచేయక, టైర్లు అరిగిపోయి వాహనాలు కదలడం లేదు. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లు అరబిందో కంపెనీ నిర్వహణలో నడుస్తున్నాయి. అయితే వీటి నిర్వహణను ఆ సంస్థ గాలికొదిలేసిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

జిల్లాలో 22 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లు ఉన్నాయి. గత టీడీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం చంద్రబాబు 2015 డిసెంబరు 31న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లను ప్రారంభించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవం అయిన తరువాత తల్లీబిడ్డని క్షేమంగా ఇంటికి చేర్చడానికి ఉచిత సేవలు అందుబాటులోకి తెచ్చారు. ఈ వాహనాలు అందుబాటులో లేనప్పుడు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వచ్చేది. ఈ పథకాన్ని చాలా ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని నిర్వహించారు. గత వైసీపీ ప్రభుత్వంలో జీవీకే కంపెనీ నుంచి తప్పించి అరబిందో కంపెనీకి నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. ఈ సంస్థతో చేసుకున్న ఒప్పందం కాల పరిమితి పూర్తి అయిపోయినట్టు తెలిసింది. ప్రభుత్వం తిరిగి ఒప్పందం చేసుకోలేదు. దీంతో సదరు సంస్థ వాహనాల నిర్వహణ బాధ్యతలను పట్టించుకోవడం లేదు. చిన్న మరమ్మతులు కూడా చేయించడం లేదు.

మూలకు చేరిన వాహనాలు

జిల్లాలో 22 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు ఉండగా, నర్సీపట్నం ప్రాంతీయ ఆస్పత్రి పరిధిలో ఆరు వాహనాలు తిరుగుతున్నాయి. టైర్లు అరిగిపోయి ఒక వాహనాన్ని గత 10 రోజులు నుంచి ఆపేశారు. బ్యాటరీలు చార్జింగ్ అవ్వడం లేదు. కొత్త బ్యాటరీలు పంపడం లేదు. బండి స్టార్ట్ అవ్వాలంటే ముందుకు నెట్టాల్సి వస్తుంది. టైర్లు అరిగిపోయి ఎక్కడ

... మిగతా 6వ పేజీలో



బ్యాటరీ పని చేయక స్టార్ట్ కాని తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌ను తోస్తున్న సిబ్బంది

మాడుగులలో భారీ చోరీ

- 40 తులాల బంగారం, కిలోన్నర వెండి, రూ.2 లక్షల నగదు అపహరణ



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

మాడుగుల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మాడుగుల రాజువీధిలోని ఓ ఇంట్లో భారీ చోరీ జరిగింది. 40 తులాల బంగారం, కిలోన్నర వెండి, రూ.2 లక్షల నగదు అపహరణకు గురైంది. బంధువుల ఇంటికి వెళ్లిన బాధితులకు ఈ విషయం సోమవారం ఉదయం తెలిసింది. దీనికి సంబంధించి బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మాడుగుల రాజువీధిలో రిటైర్డ్ ఉద్యోగిని కోడూరు లక్ష్మి, ఆమె కుమార్తె మామిడి రమణమ్మ నివాసముంటున్నారు. అయితే రమణమ్మకు ముగ్గురు కుమార్తెలు ఉండగా, మొదటి ఇద్దరు కుమార్తెలకు పెళ్లిళ్ల అయిపోయాయి. మూడో కుమార్తె పెళ్లి కోసం 40 తులాల బంగారం, కిలోన్నర వెండి సమకూర్చింది. అలాగే రూ.2 లక్షల నగదును బీరువాలో పెట్టింది. కాగా విశాఖపట్నం మల్కాపురంలో ఉంటున్న రమణమ్మ పెద్ద అల్లుడి ఆరోగ్యం బాగోకపోవడంతో వారం రోజుల క్రితం ఇంటికి తాళం వేసి తల్లితో సహా ఆమె అక్కడికి బయలుదేరి వెళ్లింది. అయితే సోమవారం ఉదయం ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో ఆ పక్కనే ఉంటున్న బంధువులు ఫోన్ చేసి ఈ విషయాన్ని రమణమ్మకు చెప్పారు. ఆమె ఇంటికి వచ్చి చోరీ జరిగిన విషయాన్ని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అనకాపల్లి డీఎస్పీ శ్రావణి, కె.కోటపాడు సీఐ పైడిపినాయుడు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. దొంగలు ఇంటి తాళాలు విరగ్గొట్టి లోపలకు ప్రవేశించి బీరువాను ఇనుప రాడ్డుతో వంచి చోరీకి పాల్పడినట్టు నిర్ధారించుకున్నారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించింది. బీరువాలోని 40 తులాల బంగారం, కిలోన్నర వెండి, రూ.2 లక్షల నగదు అపహరణకు గురైనట్టు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ జి.నారాయణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బాధితులతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రావణి

ఏటికొప్పాక బొమ్మలకు జాతీయ అవార్డు



కేంద్రమంత్రి పియూష్ గోయల్ నుంచి అవార్డు అందుకుంటున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా ఎలమంచిలి ఏటికొప్పాక బొమ్మలకు అరుదైన గౌరవం దక్కింది. జాతీయ స్థాయి అవార్డు లభించింది. సోమవారం న్యూఢిల్లీలోని భారత్ మండపంలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమలశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఒక జిల్లా-ఒక ఉత్పత్తి' (ఓడీఓపీ) అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. కేంద్ర మంత్రి పీయూష్ గోయల్, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖ గుప్తా చేతుల మీదుగా కలెక్టర్ విజయకృష్ణన్ ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏటికొప్పాక లక్కబొమ్మలు జాతీయస్థాయిలో గుర్తింపు పొందాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత శాఖ మంత్రి సవిత, కమిషనర్ జి.రేఖారాణి, ఏపీ పరిశ్రమలశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా, తదితరులు పాల్గొన్నారు.

పడకేసిన డయాలసిస్ యూనిట్లు

కేజీహెచ్ నెఫ్రాలజీ విభాగంలో 10 మెషీన్లు

ఐదు మెషీన్లు మూడు వారాలుగా పనిచేయని వైనం

- రోగులకు సేవలు అందించడంలో ఇబ్బందులు
- గతంలో 20 నుంచి 30 మందికి డయాలసిస్
- ప్రస్తుతం పది, పదిహేను మందికే...
- తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తోందని ఆవేదన
- ఉన్నతాధికారులు సమస్య పరిష్కరించాలని డిమాండ్



మూలకు చేరిన డయాలసిస్ మెషీన్లు

విశాఖపట్నం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్‌లోని నెఫ్రాలజీ విభాగంలో డయాలసిస్ సేవలు అందించే మెషీన్లు మూలకు చేరాయి. కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడే రోగులకు డయాలసిస్ చేసేందుకు విభాగంలో పది మెషీన్లు ఉన్నాయి. వీటి సాయంతో ప్రతిరోజూ 20 నుంచి 30 మందికి డయాలసిస్ చేస్తుంటారు. రోగుల సంఖ్యను బట్టి, వారికి ఉన్న సమస్యను బట్టి వైద్యులు షెడ్యూల్ ఇస్తారు. రోగి పరిస్థితిని బట్టి నెలలో రెండు నుంచి మూడుసార్లు డయాలసిస్ చేయించుకోవాల్సి ఉంటుంది. అయితే, ప్రస్తుతం ఈ విభాగంలో మెషీన్లు పనిచేయకపోవడంతో సేవలు అందించడంలో జాప్యం జరుగుతోంది. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోందని, అధిక మొత్తంలో డబ్బులు వెచ్చించాల్సి వస్తోందని రోగులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కేజీహెచ్‌లో డయాలసిస్ సేవలు పొందుతున్నట్టు ఆన్‌లైన్‌లో

... మిగతా 6వ పేజీలో

హౌసింగ్‌లో ఇన్‌చార్జుల పాలన

- 24 మండలాలకు నలుగురు ఏఈలు
- జిల్లాలో 9 మంది డీఈలకు గాను ముగ్గురితోనే పనులు
- అసాధ్యంగా మారిన ఇళ్ల నిర్మాణాల పర్యవేక్షణ
- బిల్లుల తయారీ, మంజూరులోనూ జాప్యం



నాతవరంలోని గృహ నిర్మాణ సంస్థ కార్యాలయ భవనం

నాతవరం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థలో ఇన్‌చార్జుల పాలన సాగుతోంది. జిల్లాలోని 24 మండలాలకు నలుగురు ఏఈలతో, అలాగే తొమ్మిది మంది డీఈలు ఉండాల్సి ఉండగా, ముగ్గురితోనే నెట్టుకొస్తోంది. ఒక్కొక్కరికి నాలుగు నుంచి ఐదు మండలాలను అప్పగించి ఇన్‌చార్జులుగా కొనసాగిస్తోంది.

జిల్లాలో 24 మండలాలకు నలుగురు ఏఈలు మాత్రమే ఉన్నారు. వీరంతా ఆ మండలాలకు ఇన్‌చార్జులుగా విధులు నిర్వహిస్తున్నారు. నాతవరం, చోడవరం, అనకాపల్లి, పరవాడ ఏఈలకు 24 మండలాల ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఒక్కొక్కరు నాలుగైదు మండలాల బాధ్యతలు చూడాల్సి ఉండడంతో పూర్తి స్థాయిలో సేవలు అందడం లేదు. వచ్చే ఆగస్టు నాటికి ఎన్టీఆర్ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించినా ఏఈల కొరతతో అది సాధ్యంకాదన్న వాదనలు వినిపిస్తున్నాయి. నర్సీపట్నం నియోజకవర్గంలో మాకవరపాలెం, గొలుగొండ, నర్సీపట్నం మండలాలతో పాటు నర్సీపట్నం మునిసిపాలిటీకి కూడా నాతవరం మండల హౌసింగ్ ఏఈ జోగారావు ఇన్‌చార్జి ఏఈగా విధులు నిర్వర్తిస్తున్నారు. అలాగే మిగతా మండలాలకు ముగ్గురే బాధ్యతలు చూసుకుంటున్నారు. ఇలాగైతే సకాలంలో గృహ నిర్మాణాలు ఎలా పూర్తవుతాయని పలువురు ప్రశ్నిస్తు న్నారు. దీనికి తోడు గ్రామ సచివాలయాల్లో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ప్రస్తుతం బదిలీలలో నిమగ్నమై ఉన్నారు. హౌసింగ్ ఏఈలు వీరితో సమన్వయం చేసుకుని ఇళ్ల నిర్మాణాలను

... మిగతా 6వ పేజీలో

కానిస్టేబుల్ పరీక్షల్లో నానాజీకి ప్రథమ స్థానం

» తొప్పెర్ల గ్రామస్థుల అభినందన


తల్లితో నానాజీ

అచ్యుతాపురం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఏపీ కానిస్టేబుల్ పరీక్షల్లో అచ్యుతాపురం మండలం దొప్పెర్లకు చెందిన గండి నానాజీ రాష్ట్రంలో ప్రథమ స్థానం సాధించాడు. ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో ఈయనకు 200 మార్కులకు 168 మార్కులు వచ్చాయి. నానాజీ తల్లిదండ్రులు అయ్యబాబు, జయమ్మ వ్యవసాయ కూలీలుగా పనిచేస్తూ చదివించారు. దీంతో గ్రామస్థులతోపాటు వివిధ పార్టీలకు చెందిన నాయకులు నానాజీ ఇంటికి వెళ్లి అభినందనలు తెలిపారు.

ఇద్దరి ప్రాణాలను కాపాడిన మెరైన్ పోలీసులు

ఎస్.రాయవరం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేవుపోలవరం సముద్రతీరంలో మునిగిపోతున్న ఇద్దరి ప్రాణాలను పెంటకోట మెరైన్ పోలీసులు స్థానిక మత్స్యకారులతో కలిసి కాపాడారు. ఎలమంచిలి మండలం పురుషోత్తపురం గ్రామానికి చెందిన రాజాన రమణమ్మ, పోలిరెడ్డి ప్రభళిక సముద్రస్నానం ఆచరించడానికి రేవుపోలవరం సముద్రతీరానికి వెళ్లారు. ఇద్దరూ సముద్రంలో స్నానమాచరిస్తుండగా ఒక్కసారిగా వచ్చిన అలల తాకిడికి మునిగిపోతుండగా అక్కడే గస్తీ నిర్వహిస్తున్న మెరైన్ పోలీసులు, స్థానిక మత్స్యకారులతో కలిసి వారిని బయటకు తీసుకొచ్చారు. ప్రథమ చికిత్స అందించిన అనంతరం నక్కపల్లి ప్రభుత్వ ఆస్పతికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం రమణమ్మను అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. వీరిద్దరూ ఆరోగ్యంగా ఇంటికి చేరుకున్నారని కుటుంబ సభ్యులు తెలిపారు.

నాడు అక్క.. నేడు చెల్లి

» ఇద్దరూ నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఎంపిక


అక్కాచెల్లెల్లు పి.యోచిత, మౌళిక

ఎలమంచిలి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ప్రతిభకు పేదరికం అడ్డురాదని నిరూపించారు ఈ పేదింటి అక్కా చెల్లెళ్లు. గతే ఏడాది పదో తరగతి పరీక్షల్లో అత్యంత ప్రతిభ కనబరిచి ట్రిపుల్ ఐటీకి అక్క ఎంపికైతే.. ఈ ఏడాది జరిగిన టెన్త్ పరీక్షల్లో ప్రతిభ చూపి చెల్లి కూడా ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. ఎలమంచిలిలో అగ్నిమాపక కాలనీకి చెందిన పంచదార్ల కృష్ణంరాజు అచ్యుతాపురం సెజ్‌లోని ప్రైవేటు పరిశ్రమలో చిరు ఉద్యోగిగా పనిచేస్తున్నారు. ఈయన పెద్ద కుమార్తె పి.యోచిత, చిన్న కుమార్తె మౌలిక తులసీనగర్‌లోని బాలికల ఉన్నత పాఠశాలలోనే విద్యనభ్యసించారు. గతేడాది పెద్ద కుమార్తె యోచిత 10వ తరగతిలో 574 మార్కులు సాధించడంతో నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు దక్కించుకుంది. ఈ ఏడాది చిన్న కుమార్తె మౌలిక ఇదే స్కూలులో 10వ తరగతిలో 582 మార్కులు సాధించి నూజివీడు ట్రిపుల్ ఐటీలో చేరింది. తన కుమార్తెలు ఇద్దరూ ప్రతిభ కనబరిచి ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించడం పట్ల తండ్రి కృష్ణంరాజు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

» టీడీపీ మండల అధ్యక్షుడు పెట్ల లింగంనాయుడు


బోడపాలెంలో మహిళలకు బ్రోచర్‌ను అందజేస్తున్న టీడీపీ నేతలు

కోటవురట్ల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ మండల అధ్యక్షుడు పెట్ల లింగంనాయుడు అన్నారు. సోమవారం మండలంలోని బోడపాలెంలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి మహిళలకు కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించి, కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు అభివృద్ధి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కోటవురట్ల పీఏసీఎస్ చైర్‌పర్సన్ వేచలపు జనార్దన్, బోడపాలెం బ్రదర్స్ సత్యనారాయణ, నానిబాబు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అణుకు గ్రామానికి రోడ్డు వేయాలని ఆందోళన


ఆందోళన చేస్తున్న అణుకు గ్రామ గిరిజనులు

కోటవురట్ల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో గొట్టివాడ శివారు అణుకు గ్రామానికి రహదారి సౌకర్యం, పాఠశాల ఉపాధ్యాయుడిని నియమించాలని గిరిజనులు డిమాండ్ చేశారు. సోమవారం గ్రామ సమీపంలో గిరిజనులు ఆందోళన చేశారు. గ్రామంలో 150 మంది గిరిజనులను నివసిస్తున్నామని, పాఠశాలకు వెళ్లి రావాలంటే 9 కిలోమీటర్లు కాలినడకన వెళ్లాల్సి వస్తుందన్నారు. సీపీఎం మండల కార్యదర్శి డేవిడ్ మాట్లాడుతూ పాఠశాలను మంజూరు చేస్తే తాత్కాలికంగా షెడ్డును నిర్మించుకుంటామన్నారు. అనంతరం అణుకు గిరిజనులు అనకాపల్లిలోని కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి సమస్యలపై వినతిపత్రాన్ని అధికారులకు అందజేశారు.

రేపు విద్యుత్ సరఫరా ఉండని గ్రామాలు

అచ్యుతాపురం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం 20 గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె. రాజశేఖర్, అచ్యుతాపురం ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు కారణంగా వెదురువాడ, గొర్లె ధర్మవరం, లంక ధర్మవరం, మెట్ట ధర్మవరం, మార్టూరు రోడ్డు, దిబ్బపాలెం, భోగాపురం, అచ్యుతాపురం, మోసయ్యపేట, మార్టూరు, చోడపల్లి, ఆమన్నపాలెం, కొత్తూరు మోసయ్యపేట, భోగాపురం రోడ్డు, రామన్నపాలెం, ఇందిరమ్మకాలనీ, ఆవరాజాం, చోడపల్లి కొత్తూరు, ఆవసోమవరం, ఆవరాజాం గ్రామాలకు ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు వరకు సరఫరా ఉండదని తెలిపారు.

కొల్లివానిపాలెంలో అన్యమత ప్రచారం

» అడ్డుకున్న గ్రామస్థులు.. ఇరువర్గాల వాగ్వాదం

» గ్రామస్థులపై రాయితో దాడి చేయడానికి బాలుడు యత్నం

» తప్పయిందని చెప్పి వెళ్లిపోయిన అన్యమత ప్రచారకులు


కొల్లివానిపాలెంలో అన్యమత ప్రచారకులతో వాగ్వాదం జరుగుతున్న దృశ్యం


గ్రామస్థులపై రాయి తీసిన అన్యమత బాలుడు

అచ్యుతాపురం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దోసూరు పంచాయతీ శివారు కొల్లివానిపాలెంలో అన్యమత ప్రచారకులు రెండు ఆటోల్లో సోమవారం వచ్చారు. మైకుల్లో ప్రచారం చేస్తూ కరపత్రాలు పంచడానికి ప్రయత్నించారు. దీంతో గ్రామస్థులు వారిని అడ్డుకున్నారు. ఇక్కడ ప్రచారం చేయకుండా వెళ్లిపొమ్మని కోరారు. అందుకు అన్యమత స్థులు గ్రామ స్థులతో వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా ఒక అన్యమత బాలుడు పెద్ద సిమెంటు ఇటుకను తీసి వాగ్వాదానికి దిగిన వారిపై దాడిచేయడానికి ప్రయత్నించాడు. దీనిని గమనించిన కొల్లివానిపాలెం గ్రామస్థులు దాడి చేయడానికి ప్రయత్నించిన బాలుడిని పట్టుకున్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని నిర్ణయించారు. మొత్తం విషయాన్ని వీడియో తీశామని గ్రామస్థులు పేర్కొన్నారు. మతం పేరుతో చిన్నపిల్లలను కూడా క్రూరులుగా మారుస్తున్నారని మండిపడ్డారు. దాడికి యత్నించిన బాలుడిపై పోలీస్ కేసు పెడతామని గ్రామస్థులు పట్టుబట్టారు. దీంతో అన్యమతస్థులు గ్రామస్థులను బతిమలాడి తాము వచ్చిన ఆటోల్లో వెళ్లిపోయారు.

బల్క్ డ్రగ్ పరిశ్రమకు భూములివ్వం

» ఎస్‌డీసీకి స్పష్టం చేసిన గుర్రాజుపేట గ్రామస్థులు


ఏపీఐఐసీ డిప్యూటీ కలెక్టర్ అనితకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

ఎస్.రాయవరం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి మండలంలో ఏర్పాటు చేయనున్న బల్క్ డ్రగ్ పరిశ్రమకు మండలంలోని గుడివాడ రెవెన్యూ పరిధిలోని తమ భూములను ఇచ్చేది లేదని గుర్రాజుపేట రైతులు స్పష్టం చేశారు. సోమవారం గుర్రాజుపేట పంచాయతీ కార్యాలయంలో ఏపీఐఐసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనిత ఆధ్వర్యంలో స్థానిక రైతులతో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బల్క్ డ్రగ్ పార్కు కోసం గుడివాడ రెవెన్యూ గుర్రాజుపేటలో 172 ఎకరాలను సేకరిస్తున్నట్టు తెలిపారు. ప్రతి ఒక్కరికీ చట్టప్రకారం ప్రభుత్వం తరుపున న్యాయం చేస్తామన్నారు. దీంతో గ్రామసభకు హాజరైన రైతులు ప్రమాదకరమైన బల్క్ డ్రగ్ వంటి పరిశ్రమలకు తమ భూములిచ్చేది లేదని తేల్చి చెప్పారు. గ్రామానికి చెందిన మహదేవ్ అనే యువ రైతు మాట్లాడుతూ తమకున్న 49 ఎకరాల్లో వ్యవసాయం చేయడానికి ఆస్ట్రేలియాలో ఉద్యోగం వదులుకొని వచ్చానన్నారు. ఇక్కడ సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేయనున్నట్టు చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లో తమ భూములను ఆ పరిశ్రమకు ఇవ్వడం జరగదన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మాట్లాడుతూ భూసేకరణ చట్టం ప్రకారం రైతుల ఇష్టం మేరకే భూములను సేకరించాలని కోరారు. అనంతరం భూసేకరణ విరమించకోవాలంటూ స్థానిక రైతులు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనితకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జె రమేష్‌బాబు, సర్పంచ్ మంగ, ఉప సర్పంచ్ దాట్ల రాజన్నరాజు, రైతులు పాల్గొన్నారు.

ఎలమంచిలి డిగ్రీ కళాశాల విద్యార్థుల పరిశోధనకు అంతర్జాతీయ గుర్తింపు

» ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్


పరిశోధన విద్యార్థులతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ఎలమంచిలి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతుల అభివృద్ధిపై స్థానిక గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు జరిపిన పరిశోధనకు అంతర్జాతీయ గుర్తింపు లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. చంద్రశేఖర్ తెలిపారు. ఇందుకు కారణమైన అధ్యాపకులు, విద్యార్థులను సోమవారం ఆయన అభినందించారు. కళాశాల జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో పశుపోషణ ప్రభావం అనే అంశంపై విద్యార్థులు చేపట్టిన సమగ్ర శాస్త్రీయ పరిశోధన అంతర్జాతీయ గుర్తింపును పొందిందని తెలిపారు. ఈ విలువైన పరిశోధన ఫలితాలు రెండు అంతర్జాతీయ స్థాయి శాస్త్రీయ జర్నల్స్‌లో ప్రచురితమైనట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. పరిశోధనకు మార్గదర్శకులుగా వ్యవహరించిన జంతుశాస్త్ర విభాగాధిపతి డాక్టర్. అర్జున అప్పారావు మాట్లాడుతూ విద్యార్థుల శ్రమ, శాస్త్రీయ ధోరణి, ఫీల్డ్ వర్క్, నిబద్ధత ఈ విజయానికి కారణమన్నారు. ఈ పరిశోధన బీఎస్సీ జువాలజీ హానర్స్ విద్యార్థులు ఎన్. వరలక్ష్మి, జి.శ్రీలక్ష్మి, ఎస్.జ్ఞానేశ్వరి, జి. లీలా సౌజన్య, జి.రమ్య, ఎం. స్వామి దుర్గాప్రసాద్, ఆర్. తేజస్వరిలు చేశారని ప్రిన్సిపాల్ తెలిపారు.

డొంకాడ దళితులకు న్యాయం చేయాలి

» డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు వడలి శివప్రకాష్


డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు వడలి శివప్రకాష్‌ని కలిసిన డొంకాడ దళితులు

పాయకరావుపేట, జూలై 14 (ఆంధ్రజ్యోతి):నక్కపల్లి మండలం డొంకాడ దళితులపై దాడి చేసిన వ్యక్తులపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు వడలి శివప్రకాష్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో డొంకాడకు చెందిన పలువురు దళితులను కలిసిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది మే 18న డొంకాడలో జరిగిన వివాహంలో వరుడి సెల్‌ఫోన్ కనిపించకుండా పోవడంతో టెంట్ హౌస్ పనుల నిమిత్తం వచ్చిన కొంతమందిని కొట్టి గాయపర్చడంతోపాటు అడ్డువచ్చిన పెద్దలపై కూడా దాడి చేశారన్నారు. ఇందుకు సంబంధించి తమపై దాడి జరిగిందని ఎనిమిది మంది బాధితులు నక్కపల్లి పోలీస్ స్టేషన్‌లో 14 మందిపై ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు పోలీసులు ఎటువంటి విచారణ చేయకపోవడం దారుణమన్నారు. దళిత నియోజకవర్గాల్లో దళితులపై దాడి జరుగుతుంటే ప్రభుత్వాలు మీనమేషాలు లెక్కిస్తున్నాయని విమర్శించారు. చివరకు రాష్ట్ర హోం మంత్రి దృష్టికి తీసుకుని వెళ్లినా బాధితులకు న్యాయం జరగలేదన్నారు. జరిగిన సంఘటనను రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి బాధితులు ఫిర్యాదు చేసిన 14 మందిపై కేసులు నమోదుచేసి అరెస్టు చేయడంతోపాటు కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి వెలుగుల అర్జునరావు, బాధితులు కూరపాటి అప్పారావు, వీధి బాబ్జీ, కృష్ణ, అయినవిల్లి స్వర్ణరాజు, అయినవిల్లి జ్యోతి, జయాసాగర్, కాళ్ల మధు, వీధి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా రాంబిల్లి సంపద కేంద్రం

» పూర్తిగా పాడైన పైకప్పు

» చుట్టూ పెరిగిన తుప్పలు

» పట్టించుకోని పంచాయతీ అధికారులు, పాలకులు


రాంబిల్లి చెత్త నుంచి సంపద కేంద్రం (ఫైల్‌ఫొటో)


ప్రస్తుతం ఇలా పిల్లర్లతో ఉన్న సంపద కేంద్రం

రాంబిల్లి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల ఆర్థిక పరిపుష్టికి టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన సంపద కేంద్రం రాంబిల్లిలో నిరుపయోగంగా మారింది. 2014లో టీడీపీ ప్రభుత్వం రాంబిల్లి కొండ వద్ద లక్షలాది రూపాయలతో చెత్తతో సంపద తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఇందుకు పారిశుధ్య సిబ్బందిని నియమించింది. కొంత కాలం ఈ సందప కేంద్రం బాగానే పనిచేసింది. తరువాత అప్పటి అధికారులు, పంచాయతీ పాలకులు పట్టించుకోకపోవడంతో సంపద కేంద్రం అలంకార ప్రాయంగా మారింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ సంపద కేంద్రాన్ని పూర్తిగా పట్టించుకోకపోవడంతో శిథిలమై మూలకు చేరింది. సంపద కేంద్రం పూర్తిగా దెబ్బతినడంతోపాటు చుట్టూ తుప్పలు పెరిగిపోయి అడవిని తలపించే విధంగా తయారైంది. దీని చుట్టూ లేఅవుట్లు ఏర్పాటు చేసి ఇళ్ల నిర్మాణాలు చేపట్టడంతో సంపద కేంద్రం గుర్తుపట్టలేని పరిస్థితి నెలకొంది. అన్ని పంచాయతీలలో పక్కాగా సంపద కేంద్రాలను ఏర్పాటు చేయగా.. మండల కేంద్రంలో తాటాకులతో ఏర్పాటు చేశారు. పంచాయతీ అధికారులు, పాలకుల నిర్లక్ష్యం కారణంగానే ఈ దుస్థితి నెలకొందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ కేంద్రాన్ని అధికారులు ఎవరూ సందర్శించిన దాఖలాలు కూడా లేవని వారంటున్నారు. ఇప్పటికైన సంబంధిత శాఖ అధికారులు పట్టించుకొని సంపద కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

అధ్వానంగా ఇందిరమ్మ, జగనన్న కాలనీ రోడ్లు

మునగపాక, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రెండు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలు గ్రామాల్లో రోడ్లు అధ్వానంగా మారాయి. మునగపాకలో ఇందిరమ్మ, జగనన్న కాలనీల రోడ్లు వర్షాలకు బురదమయం అయ్యాయి. పాదాచారులు, ద్విచక్ర వాహనదారులు భయంగా రాకపోకలు సాగిస్తున్నారు. ఇందిరమ్మ కాలనీ ఏర్పాటు జరిగి 20 సంవత్సరాలు కావస్తున్నా మౌలిక వసతులు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయలేదు. 2004కు ముందు అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సారథ్యంలో కాలనీకి భూసేకరణ చేశారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇందిరమ్మ కాలనీగా నామకరణ చేశారు. పక్కా కాలనీ ఏర్పాటు అయిన తరువాత నాలుగు ప్రభుత్వాలు, నలుగురు ఎమ్మెల్యేలు పదవీకాలం ముగిసినా సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలకు నోచుకోలేదు. ఆ నలుగురు ఎమ్మెల్యేల్లో గండి బాబ్జీ, కన్నబాబురాజు, పంచకర్ల రమేష్‌బాబు ఉన్నారు. బాగా లోతట్టుగా ఉండే కాలనీ నీటిముంపు నుంచి బయటపడిందంటే అది విశాఖ డెయిరీ పుణ్యమేనని కాలనీకి చెందిన పలువురు చెబుతున్నారు. ప్రధాన రోడ్డుతోపాటు ఇంటర్నల్ రోడ్లను గ్రావెల్‌తో విశాఖ డెయిరీ ఎత్తు చేసింది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఇందిరమ్మ కాలనీతోపాటు జగనన్న కాలనీ కూడా బురదమయంగా మారాయి. సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని ఆయా కాలనీ వాసులు కోరుతున్నారు.

నక్కపల్లి హాస్టళ్ల ఆకస్మిక తనిఖీ


నక్కపల్లి బీసీ హాస్టల్‌ను తనిఖీ చేస్తున్న డీడీ శ్రీదేవి

నక్కపల్లి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీసీ, ఎస్సీ వసతి గృహాలను సోమవారం అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. నక్కపల్లి బీసీ హాస్టల్ అధ్వానంగా వుందని, అధికారులు ఏం చేస్తున్నారంటూ ఆదివారం కాంగ్రెస్ నాయకుడు మేడేటి శంకర్ వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దీనిపై అధికారులు స్పందించారు. బీసీ వెల్ఫేర్ డీడీ శ్రీదేవి బీసీ వసతి గృహాన్ని తనిఖీ చేశారు. అప్పటికే ఎంపీడీవో సీతారామరాజు, ఎంఈవో కె.నరేశ్ ఆదేశాల మేరకు బీసీ వసతి గృహ పరిసరాలను పరిశుభ్రంగా తయారు చేశారు. వసతి గృహాల సమస్యలపై డీడీ శ్రీదేవి విద్యార్థులతో మాట్లాడారు. టాయిలెట్స్‌ను ఎప్పటికప్పుడు శుభ్రంగా తయారు చేయాలని హాస్టల్ సిబ్బందిని ఆదేశించారు.ఎస్సీ వసతి గృహాన్ని ఎంపీడీవో సీతారామరాజు, ఎంఈవో నరేశ్ కూడా తనిఖీ చేసి, హాస్టల్‌లో ఏ సమస్యలు లేకుండా చూడాలని హాస్టల్ సిబ్బందిని ఆదేశించారు.

పాయకరావుపేట నియోజకవర్గ బీఎల్‌వోలకు శిక్షణ

నక్కపల్లి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పాయకరావుపేట నియోజకవర్గం బీఎల్‌వోలకు ఈఆర్‌వో గీతాంజలి శిక్షణ ఇచ్చారు. బూత్ స్థాయిలో కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల జాబితాల్లో చేర్పులు, మార్పులకు సంబంధించి పలువురి సందేహాలను ఆమె నివృత్తి చేశారు. అనంతరం వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సమావేశంలో ఏఈఆర్‌వో నర్సింహమూర్తి, డీటీ నారాయణరావు పాల్గొన్నారు.

పాడి రైతులకు ఏరువాక బోనస్ పంపిణీ

అచ్యుతాపురం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రైతుల ఆర్థికాభివృద్ధే తమ ధ్యేయమని హెరిటేజ్ డెయిరీ మేనేజర్ కూండ్రపు శేషు అన్నారు. సోమవారం ఆయన మడుతూరులో 23 మంది పాడి రైతులకు రూ.2.1 లక్షల ఏరువాక బోనస్‌ని పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ లాభాపేక్ష లేకుండా పాడి రైతుల సంక్షేమానికి తమ డెయిరీ అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. అన్ని డెయిరీల కన్నా అధిక ధరలకు పాలను కొనుగోలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాము, నీరుకొండ పార్వతి, సంతోష్, ఈశ్వరరావు, లక్ష్మణరావు, బలిరెడ్డి చిన్నశ్రీను, మాసారపు శివ తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న మహిళకు ఆర్థిక సాయం


ఉషారాణికి ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న సహచరులు

అచ్యుతాపురం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న మహిళకు తనతో చదువుకు క్లాస్‌మేట్స్ రూ.60 వేలు ఆర్థిక సాయాన్ని చేసి ఆదుకున్నారు. అచ్యుతాపురంలో ఒక కర్మాగారంలో పనిచేసుకుంటూ కుమార్తెను చదివించుకుంటున్న ఒంటరి మహిళ మైలపల్లి ఉషారాణి ఇటీవల రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు విరిగిపోయాయి. ఈమె 2002-2003లో అచ్యుతాపురం ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకుంది. ఈ విషయం తెలుసుకున్న అప్పటి క్లాస్‌మేట్స్ విరాళాలు వేసుకొని సోమవారం రూ. 60 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. పవన్ విజయ్, ధర్మిరెడ్డి రవితేజ, ఉమా, లక్ష్మి, కె. సోమునాయుడు, ఎస్. వెంకన్న, ప్రగడ జూనియర్ నాగేశ్వరరావు ఆర్థిక సాయాన్ని చేశారు.

పాటిపల్లిలో భూ సర్వే పనులకు సహకరించండి

మునగపాక, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాటిపల్లిలో భూసర్వే జరగనుందని, రైతులు సహకరించాలని స్థానిక తహశీల్దార్ పి.సత్యనారాయణ కోరారు. మండలంలో పాటిపల్లి సచివాలయంలో సోమవారం రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామంలో సర్వే నంబర్లు 79, 112, 113లో 600 ఎకరాల భూమి సర్వే చేస్తామని తెలిపారు. సర్వే బృందాలకు రైతులు వారి భూమికి సంబంధించిన రికార్డులతో సహకరించాలని చెప్పారు. ఈ సమావేశంలో సర్పంచ్ ఆడారి కృష్ణవేణి, త్రిమూర్తులు, వీఆర్వో వెంకటరమణ, సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర ఆలయ నిర్మాణానికి రూ.2 లక్షల విరాళం


పెద్దలకు విరాళాన్ని అందజేస్తున్న అప్పలనాయుడు, యశోద

మునగపాక, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మునగపాకలో రూ.5కోట్లు అంచనాతో నిర్మిస్తున్న వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి విరాళాలు ఇచ్చేందుకు భక్తులు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు. సోమవారం నిర్మాణం జరుగుతున్న ఆలయం వద్దకు మునగపాకకి చెందిన ఆడారి అప్పలనాయుడు, యశోద దంపతులు విచ్చేసి కమిటీ పెద్దలకు రూ.2లక్షలు విరాళంగా ఇచ్చారు. వారిని కమిటీ పెద్దలు బొడ్డేడ ప్రసాద్, సూరిశెట్టి రాము, మొల్లేటి సత్యనారాయణ, దాడి ముసిలినాయుడు, కాండ్రేగుల జగ్గారావు, పెంటకోట ఉమేష్ అభినందించారు.

మత్స్యకార సమస్యలపై వినతిపత్రం

నక్కపల్లి,జూలై 14 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట నియోజకవర్గంలోని మత్స్యకారుల సమస్యలపై సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అధికారులకు వాసుపల్లి శివ, సిరిపల్లి అప్పలరాజు వినతిపత్రం అందజేశారు. రాజయ్యపేట కేంద్రంగా రెండేళ్ల కిందట ఫిషింగ్ జెట్టీ నిర్మిస్తామని అప్పట్లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఇప్పటి వరకూ ఎటువంటి పనులు ప్రారంభం కాలేదని ఆవేదన వెలిబుచ్చారు. తక్షణమే ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌గానీ మినీ జెట్టీని గానీ నిర్మించాలని కోరారు. వేట సాగక, పూట గడవక ఇప్పటికీ అనేక మంది మత్స్యకారులు ఇతర ప్రాంతాలకు వలసపోతున్నారని చెప్పారు. వేట సాగించే మత్స్యకారులకు సరైన సదుపాయాలు, భద్రత కల్పించాలని కోరారు. మత్స్యకారుల వలసలు నివారించాలని కోరారు.

విద్యుదాఘాతంలో తోడపెద్దు మృతి

పాయకరావుపేట రూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్.నర్సాపురంలో సోమవారం విద్యుదాఘాతంతో తోడపెద్దు మృతిచెందిందని గ్రామస్థులు తెలిపారు. గ్రామంలో తిరిగే తోడపెద్దుకు సోమవారం జగనన్న కాలనీ సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వైర్లు తగలడంతో అక్కడికక్కడే మృతిచెందింది. తోడపెద్దుకి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం గ్రామంలో ఊరేగించి శివారులో ఖననం చేశారు.

84వ వార్డు టీడీపీ అధ్యక్షుడిగా లక్ష్మీప్రసాద్



ప్రసాద్‌ను అభినందిస్తున్న నేతలు పీలా గోవింద, మళ్ల సురేంద్ర తదితరులు

అనకాపల్లి టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 84వ వార్డు టీడీపీ అధ్యక్షుడిగా తలారి లక్ష్మీప్రసాద్ ఎన్నికయ్యారు. కోట్నివీధి కల్యాణ మండపంలో ఆదివారం ఎన్నికల పరిశీలకుడు అచ్చుల నాయుడు ఆధ్వర్యంలో ఈ ప్రక్రియను నిర్వహించారు. అధ్యక్షుడిగా తలారి లక్ష్మీప్రసాద్, ఉపాధ్యక్షుడుగా పిళ్లా తారకేసు, ప్రధాన కార్యదర్శిగా సాలాపు మోహన్‌లను పరిశీలకుడు ప్రకటించారు. కార్యనిర్వాహక కార్యదర్శులుగా కశిరెడ్డి అప్పలకొండ, సూరారపు వెంకటగిరి, రేబాక ఈశ్వర అప్పారావు, కార్యదర్శులుగా నమ్మి రామారావు, గ్రంధి వినయ్, కోశాధికారిగా గవర సురేష్, మహిళా విభాగం అధ్యక్షురాలుగా నాగమణిలను ఎన్నుకున్నారు. వార్డు టీడీపీ ఇన్‌చార్జి మాదంశెట్టి నీలబాబు అధ్యక్షతన జరిగిన ఈ ఎన్నికల్లో పార్టీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీలా గోవింద సత్యనారాయణ, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీలు ఎన్నికైన వారిని అభినందించారు.

'స్మార్ట్ మీటర్లు బిగించి ప్రజలపై భారాలు మోపవద్దు'



ప్లకార్డులు చూపుతున్న పౌర సంక్షేమ సంఘం సభ్యులు

అనకాపల్లి టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : స్మార్ట్ మీటర్లు బిగించి ప్రజలపై భారాలు మోపవద్దని పట్టణ పౌర సంక్షేమ సంఘం రౌండ్ టేబుల్ సమావేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సోమవారం ఇక్కడ రైతు సంఘం నాయకుడు కాళ్ల తేలయ్యబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వక్తలు మాట్లాడారు. అదానీ కంపెనీకి చెందిన వ్యక్తులు వచ్చి దౌర్జన్యంగా మీటర్లు బిగిస్తున్నారని, దీనిని అంతా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ ఇప్పటికే ప్రజలపై ఆర్థిక భారాలు బాగా పెరిగాయని, స్మార్ట్‌మీటర్ల వల్ల మరింత భారం పెరిగే అవకాశముందన్నారు. దీనిని తక్షణమే నియంత్రించాలన్నారు. అనంతరం ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ సమావేశంలో ఎ.మల్లికార్జున, మద్దిల అప్పారావు, కె.రామకృష్ణ, భీమరశెట్టి నాయుడు, పి. శివరామ, సతీష్, భీశెట్టి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు తరలించాలని ఆందోళన

అనకాపల్లి టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి జీవీఎంసీ జోనల్ కార్యాలయ ఆవరణలో ఉన్న డంపింగ్ యార్డు వద్ద సోమవారం అనకాపల్లి విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు పాత్రపల్లి వీరుయాదవ్ నిరసన చేపట్టారు. పట్టణ నడిబొడ్డున అనధికారికంగా కొనసాగుతున్న ఈ డంపింగ్ యార్డును తరలించాలని డిమాండ్ చేశారు. దీని వల్ల పరిసరాల వారు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు.

సమష్టిగా అనకాపల్లి అభివృద్ధి

▸▸ వివిధ విభాగాల అధికారుల సమావేశంలో జడ్సీ చక్రవర్తి



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ చక్రవర్తి

అనకాపల్లి టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణం అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి అన్నారు. సోమవారం తన కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో వర్షాలు కురిస్తే నీరు నిలిచిపోయి చెరువును తలపిస్తుందని, దీనిపై తగు చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. స్టేషన్‌రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులపై చర్చించారు. ఆస్తులు నష్టపోయిన వారికి వెనువెంటనే టీడీఆర్‌లు ఇచ్చి అభివృద్ధి పనులు పూర్తి చేయాలని సూచించారు. నూకాంబిక ఆలయం వద్ద డ్రైనేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. విశాఖ నుంచి అనకాపల్లి ఆరంభంలోని జలగలమదుం జంక్షన్ వద్ద దివంగత ప్రధాన మంత్రులు వాజ్‌పేయి, పీవీ నరసింహారావు విగ్రహాలు ఏర్పాటు చేసి, సెంట్రల్ లైటింగ్ అందుబాటులోకి వచ్చేందుకు ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. నూకాంబిక ఆలయానికి భక్తులు వచ్చే రెండో మార్గాన్ని అభివృద్ధిపరచాలని సూచించారు. 84వ వార్డులో రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని సూచించగా, అంచనాలను తయారుచేసి జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి పంపామని ఈఈ శేఖర్, డీఈ గోపాలకృష్ణ వివరించారు. వీధి లైట్లు పాడైనచోట కొత్తవాటిని ఏర్పాటు చేయాలన్నారు. విలీన గ్రామాల్లో పన్ను లేని ఇళ్లను గుర్తించి, వాటికి ఇంటి పన్నులు వేయాలని రెవెన్యూ విభాగం అధికారులకు ఆదేశించారు. డ్వాక్రా సంఘాల పనితీరుపై దృష్టి సారించాలని ఏపీడీ సంతోష్‌కుమార్‌కు సూచించారు. ఈ సమావేశంలో సూపరింటెండెంట్ రమణ పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణనగర్ స్కేటింగ్ పార్కులో సమస్యలు పరిష్కరించండి

అనకాపల్లి టౌన్ : ఇక్కడి లక్ష్మీనారాయణనగర్‌లోని స్కేటింగ్ పార్కులో సమస్యలను తక్షణమే పరిష్కరించాలని జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు. ఇందులో భాగంగా స్కేటింగ్ పార్కులో ఉన్న సమస్యలను చూసి పరిష్కారానికి సూచనలు చేశారు. పార్కులో దెబ్బతిన్న సిమెంట్ బెంచీలను తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలని, వాచ్‌మెన్‌ను నియమించాలని సూచించారు. త్వరితగతిన ఈ పనులు పూర్తి కావాలన్నారు.

జూనియర్ లైన్‌మెన్‌లకు పదోన్నతులు కల్పించాలి

▸▸ రాష్ట్ర గ్రామ, వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయీస్ అసోసియేషన్ వినతి

అనకాపల్లి టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : జూనియర్ లైన్‌మెన్‌లకు అసి స్టెంట్ లైన్‌మెన్‌లుగా పదోన్నతులు కల్పించాలని రాష్ట్ర గ్రామ, వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర సమితి సభ్యుడు కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఈపీడీసీఎల్ ఎస్ఈ కార్యాలయంలో ఏడీఎం డి.శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందజేశారు. నూతన సర్వీస్ రూల్స్‌ను తక్షణమే రద్దు చేయాలన్నారు. అక్టోబరు 2019 నుంచి సచివాలయ ఉద్యోగులకు అమలవుతున్న అన్ని రకాల సెలవులు జూనియర్ లైన్‌మెన్ గ్రేడు-2లకు అమలు చేయాలన్నారు. విద్యుత్ సంస్థల్లో కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికలు తక్షణమే నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు వాయిబోయిన శేఖర్, యశ్వంత్, వెంకటేష్, వై.గణేష్, బి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డీఐఈవోకు కళాశాలల యజమానులు సత్కారం



డీఐఈవోను సత్కరించిన యాజమానులు

అనకాపల్లి టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ (డీఐఈవో) వినోద్‌బాబును సోమవారం ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు జూనియర్ కళాశాలల యాజమనుల అసోసియేషన్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన వినోద్‌బాబును సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.జనార్ధన్, సత్యనారాయణ, సన్యాసినాయుడు, నాగేశ్వరరావు, నాని, శేషగిరిరావు, పి.శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు. జిల్లాలో ఇంటర్మీడియట్ విద్య సజావుగా సాగాలని, మంచిఫలితాలు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని ఆయన సూచించినట్టు అసోసియేషన్ ప్రతినిధులు విలేకరులకు తెలిపారు.

ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లపై అప్రమత్తంగా ఉండాలి : సీఐ



గ్రామస్థులతో మాట్లాడుతున్న సీఐ మల్లికార్జునరావు

పరవాడ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల పట్ల యువకులు అప్రమత్తంగా ఉండాలని సీఐ ఆర్.మల్లికార్జునరావు సూచించారు. సోమవారం రాత్రి ఆయన సిబ్బందితో కలిసి ముత్యాలమ్మపాలెంలో పర్యటించారు. అక్కడి యువకులతో మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. గంజాయి జోలికి వెళ్లరాదని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించాలని ఆందోళన

పరవాడ, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ఫార్మాసిటీలో గల స్మైలెక్స్ ల్యాబ్స్ పరిశ్రమ ఎదుట సోమవారం మహాలక్ష్మి ఎంటర్‌ప్రైజెస్ ఫ్యాబ్రికేషన్ సంస్థకు చెందిన కాంట్రాక్టర్, వారి బంధువులు ఆందోళన చేపట్టారు. రెండేళ్ల క్రితం పరిశ్రమలో ఫ్యాబ్రికేషన్ పనులు చేపట్టగా రూ.15.75 లక్షల బిల్లు చెల్లించాల్సి ఉన్నప్పటికీ యాజమాన్యం తాత్సారం చేస్తోందని ఆరోపించారు. తక్షణమే ఈ సమస్యపై స్పందించాల్సిందిగా వారు కోరారు.

80 పశువులకు వైద్య పరీక్షలు

తుమ్మపాల, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ఉచిత పశు వైద్య శిబిరాన్ని సోమవారం ఇక్కడ విశాఖ డెయిరీ ఆధ్వర్యంలో నిర్వహించారు. సుమారు 80 పశువులకు వైద్యులు పరీక్షలు జరిపి, వ్యాక్సిన్లు వేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారిణి డాక్టర్ జ్ఞానప్రసూన మాట్లాడుతూ రైతులు పాడి సంరక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డెయిరీ సూపర్‌వైజర్ ఏసుదాసు, పాల సంఘం అధ్యక్షుడు కాశీ, మాజీ అధ్యక్షుడు సూరిశెట్టి శ్రీనివాసరావు, రైతు సంఘం అధ్యక్షుడు బుజ్జి, మాజీ అధ్య క్షుడు మోదినాయుడు, డైరెక్టర్ బాలాజీ, నీటి సంఘం డైరె క్టర్ కొణతాల రాజు పాల్గొన్నారు.

మునగకొండ వద్ద గ్రావెల్ తవ్వకాలను అడ్డుకున్న పోలీసులు

సబ్బవరం, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : గ్రావెల్ తవ్వకాలకు రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారుల అనుమతులు తప్పనిసరిగా ఉండాలని ఎస్ఐ దివ్య అన్నారు. గాలి భీమవరంలో గత ప్రభుత్వం పేదల ఇళ్ల నిర్మాణాలకు రైతుల వద్ద నుంచి భూమిని సేకరించింది. పరిహారంగా ఆ రైతులకు డి.పట్టా భూములు ఎకరాకు 900 గజాలు, ఆక్రమణ భూములు ఎకరాకు 450 గజాలు ప్లాట్లుగా వేసి ఇచ్చింది. సమీపంలోని గాలిభీమవరం సర్వే నం బరు 61లో గల మునగకొండ నుంచి గత రెండు రోజులుగా యంత్రాలతో గ్రావెల్ తవ్వి ట్రాక్టర్ల ద్వారా తరలించి ఆయా ప్లాట్లను పూడ్చుతున్నారు. దీనిపై అందిన సమాచారం మేరకు ఎస్ఐ సోమవారం సిబ్బందితో అక్కడికి చేరుకుని గ్రావెల్ తవ్వకాలను అడ్డుకున్నారు. గ్రావెల్ తవ్వ కాలకు రెవెన్యూ, మైనింగ్ అధికారుల అనుమతులు తప్పనిసరిగా పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గురుకులాల్లో మిగులు సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ రేపు

కొత్తూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యా సంస్థల్లో ఐదో తరగతి నుంచి ఇంటర్ వరకు మిగిలిన ఖాళీ సీట్ల భర్తీకి అనకాపల్లి గురుకులంలో మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహిస్తామని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల విశాఖపట్నం జిల్లా సమన్వయాధికారి ఎస్.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. బాలురకు ఉదయం 9 గంటలకు, బాలికలకు మధ్యాహ్నం ఒంటిగంటకు కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. దేవరాపల్లి, గొలుగొండ, సబ్బవరం, శ్రీకృష్ణాపురం బాలుర గురుకులాలు, మేఘాద్రిగెడ్డ, సీవేఈ, నక్కపల్లి, కోనాం, నర్సీపట్నం, తాళ్లపాలెం, కొక్కిరాపల్లి బాలికల గురుకులాల్లోని ఖాళీల భర్తీకి అభ్యర్థులు హాజరుకావాల్సి ఉంటుందని చెప్పారు.

ఏడాదిన్నరగా తాగునీరు వృథా

▸▸ పట్టించుకోని ఏపీఐఐసీ అధికారులు



పైప్‌లైన్‌కు రంధ్రం పడడంతో వృథాగా పోతున్న నీరు

పరవాడ, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : అచ్యుతాపురం మండలంలో గల స్పెషల్ ఎకనామిక్ జోన్ (సెజ్)కు తాగునీటిని సరఫరా చేసే పైప్‌లైన్‌కు స్థానిక మండల పరిషత్ జంక్షన్ వద్ద రంధ్రం ఏర్పడింది. దీంతో నీరు వృథాగా పోతోంది. ఏలేరు కాలువ నుంచి తాడి వద్ద గల ఏపీఐఐసీ పంప్‌హౌస్ ద్వారా సెజ్‌కు నీటి సరఫరా జరుగుతోంది. ఏడాదిన్నర కాలం నుంచి మండల పరిషత్ జంక్షన్ సమీపంలో భూమి అడుగు భాగాన పైప్‌లైన్‌కు రంధ్రం పడడంతో పెద్ద ఎత్తున నీరువృథా అవుతోంది. ప్రధాన రహదారి గుండానీరు పారుతూ సమీపంలో గల గెడ్డలోకి చేరుతోంది. అయినప్పటికీ ఏపీ ఐఐసీ అధికారుల నిర్లక్షంగా వ్యవహరిస్తున్నారంటూ స్థానికులు మండిపడుతున్నారు.



'మునిసిపల్ కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలి'



డీఆర్‌వోకు వినతిని అందిస్తున్న ప్రతినిధులు

తుమ్మపాల, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని మునిసిపల్ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు వైఎస్ భద్రం కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో డీఆర్‌వోను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునిసిపాలిటీల్లో ఔట్‌సోర్సింగ్ విధానంలో ఇంజనీరింగ్, పారిశుధ్య, ఎలక్ట్రీషియన్, కంప్యూటర్ ఆపరేటర్లు విధులు నిర్వహిస్తున్నారన్నారు. అరకొర వేతనాలతో వీరంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. వీరికి కనీస వేతనం రూ.26వేలు అందించాలని డిమాండ్ చేశారు. దీర్ఘకాలంగా పనిచేస్తున్న వీరి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మునిసిపల్ ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గనిశెట్టి ఏసుదాసు, కార్మిక సంఘం నాయకులు టి.సోంబాబు, టి.శ్రీనివాస్, వై.సత్యనారాయణ, కె.శేఖర్, ఎ.గోవిందరావు, పి.శ్రీనివాసరావు, టి.లోకేశ్వరరావు, సూరిబాబులతో పాటు పలువురు కార్మికులు పాల్గొన్నారు.

చింతపల్లిలో ఎంపీ నిధులతో సామాజిక భవనం

▸ పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు



సామాజిక భవనానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

చింతపల్లి, జూలై 14 (ఆంధ్రజ్యోతి):చింతపల్లిలో రూ.40లక్షలు అరకు ఎంపీ నిధులతో సామాజిక భవనం నిర్మిస్తున్నామని పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సచివాలయం ఉద్యోగులు, సర్పంచులకు ఎంపీ నిధులతో కొనుగోలు చేసిన వీధిలైట్లను ఆయన పంపిణీ చేశారు. అలాగే డెయిరీ ఫారం వద్ద ఎంపీ నిధులతో నిర్మించనున్న సామాజిక భవనానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎంపీ నిధులతో తొలి విడతగా ప్రతీ పంచాయతీకి పది వీధి లైట్లు అందజేస్తున్నామన్నారు. అనంతరం జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ అందరూ ధైర్యంగా పార్టీలో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోరాబు అనుషదేవి, జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, వైస్ఎంపీపీలు గోపీనాయక్ శారద, సాగిన వెంగళరావు, ఎంపీడీవో సీహెచ్. సీతామహాలక్ష్మి సర్పంచుల ఫోరం అధ్యక్షురాలు దురియా పుష్పలత, జీకేవీధి ఎంపీపీ బోయిన కుమారి, వైసీపీ నేతలు శెట్టి వినయ్, గణబాబు, మోరి రవి, సుధాకర్ పాల్గొన్నారు.

'స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి'



ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న విద్యార్థులు

పాడేరురూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను తక్షణమే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజశేఖర్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో ఎంతో మంది పేద విద్యార్థులు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆధారపడి చదువుకుంటున్నారన్నారు. వీటిని విడుదల చేయకపోవడం వల్ల చాలా మంది విద్యార్థులు ఫీజులు కట్టలేక డ్రాప్ అవుట్లుగా ఉండిపోతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్ మెంట్‌లను తక్షణమే విడుదల చేయాలని కోరారు. ధర్నా అనంతరం డీఆర్‌వో పద్మలతకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు వి.కృష్ణ, తనీష్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

నవోదయలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

పాడేరురూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ విద్యా సంస్థల్లో 6వ తరగతిలో ప్రవేశానికి అర్హులైన 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈనెల 29వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఈవో పి.బ్రహ్మాజీరావు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వ, గుర్తింపు పొందిన విద్యా సంస్థలలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు విశాఖపట్నం జిల్లా కొమ్మాది లేదా అల్లూరి జిల్లా ఎటపాకలో ఉన్న నవోదయ విద్యా సంస్థల్లో చేరేందుకు అర్హులన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు 75 శాతం సీట్లు కేటాయిస్తారన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 29వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. డిసెంబరు 13వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని ఆయన తెలిపారు.

గంజాయి మహమ్మారిని తరిమికొట్టాలి : సీఐ

పాడేరురూరల్, జూలై 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గంజాయి మహమ్మారిని ఆదివాసీ విద్యార్థులు తరిమికొట్టాలని పాడేరు సర్కిల్ ఇనస్పెక్టర్ డి.దీనబంధు పిలుపునిచ్చారు. గిరిజన సంఘం, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కాఫీ హౌస్‌లో నిర్వహించిన ఆదివాసీ విద్యార్థిని మేలు కొలుపుదాం..! బంగారు భవిష్యత్‌కు పునాది వేద్దాం..! అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. గిరిజన విద్యార్థులకు ఉన్నత విద్యా అవకాశాలు, పోటీ పరీక్షలకు సంపూర్ణమైన అవకాశం ఉందన్నారు. యువత వాటిని వినియోగించుకొని ఉత్తమ భవిష్యత్‌ను నిర్దేశించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజయ్‌శర్మ, కె.బాలదేవ్, ఎస్.ధర్మన్నపడాల్, కార్తీక్, జీవన్ పాల్గొన్నారు.

131 గ్రామాల్లో దోమల మందు రెండో విడత పిచికారీ

గూడెంకొత్తవీధి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 12 గ్రామ సచివాలయాల పరిధిలో 131 గ్రామాల్లో రెండో విడత దోమల మందు పిచికారీ ప్రారంభించామని సీలేరు మలేరియా సబ్ యూనిట్ అధికారి కె. పోతురాజు అన్నారు. సోమవారం రింతాడ సచివాలయం పరిధిలోని ఇందిరానగర్‌లో జరుగుతున్న దోమల మందు పిచికారీని ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రెండు అంతకంటే ఎక్కువ మలేరియా కేసులు నమోదైన గిరిజన గ్రామాలను ఎంపిక చేసి మొదటి విడత దోమల మందు పిచికారీ పూర్తి చేశామన్నారు. రెండో విడతలో మిగిలిన గ్రామాల్లో దోమల మందు పిచికారీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి అరుణ్‌కుమార్, ఎంటీఎస్ శ్రావణి, ఎఫ్‌డబ్ల్యూ అచ్యుత్, హెచ్‌ఏ సత్యనారాయణ పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా శాకంబరి మహోత్సవం



శివపార్వతులను కూరగాయలతో అలంకరించిన దృశ్యం

పాడేరురూరల్, జూలై 14(ఆంధ్రజ్యోతి): పాడేరులోని ఉమానీలకంఠేశ్వర స్వామి వారి సమేత రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో సోమవారం శాకంబరి మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ ధర్మకర్త కొట్టగుల్లి సింహాచలం నాయుడు పర్యవేక్షణలో కమిటీ ప్రతినిధులు, ఆధ్యాత్మిక సేవా బృంద సభ్యులు దేవతల విగ్రహాలను శాకంబరులుగా అలంకరించారు. సోమవారం ఉదయం 7 గంటల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. భక్తులకు ఆలయ కమిటీ ప్రతినిధులతో కలిసి మాజీ ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి దంపతులు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. అనంతరం మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కొట్టగుల్లి రమేష్‌నాయుడు, కొట్టగుల్లి రామారావు, సిద్ధినాతి కొండలరావు, ఉప్పల వెంకటరత్నం, శివరాత్రి శ్రీనివాస్ కుమార్, దేముడు, శ్రీనివాస్, బాబూరావు, ప్రభాకర్, కరుణ, ఆధ్యాత్మిక సేవా బృంద మహిళలు చీపురు రమాదేవి, శాంతకుమారి పాల్గొన్నారు.

ఏజెన్సీ ఉద్యోగ నియామక చట్టం చేయాలని ఐటీడీఏ వద్ద ధర్నా



మహాధర్నాలో పాల్గొన్న గిరిజన నిరుద్యోగ యువతీ, యువకులు

పాడేరురూరల్, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ కార్యాలయం వద్ద సోమవారం ఆదివాసీ నిరుద్యోగులు, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఐదో షెడ్యూల్ ఆదివాసీ హక్కుల మహాధర్నా విజయవంతంగా ముగిసింది. తొలుత పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఐటీడీఏ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆందోళనకారులు మాట్లాడుతూ.. ఏజెన్సీ ఉద్యోగ నియామక చట్టం చేయాలని, గిరిజన ప్రాంతంలో స్పెషల్ డీఎస్సీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఐటీడీఏ అధికారులకు సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో రామారావు దొర, బి.చింటి, సోమేల స్వామి, సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

అగ్రికల్చర్ పాలిటెక్నిక్‌ను కొనసాగించాలని ఎమ్మెల్యే ఆందోళన



ఆర్ఏఆర్ఎస్ ద్వారం వద్ద బైఠాయించిన ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు, ప్రజాప్రతినిధులు

చింతపల్లి, జూలై 14 (ఆంధ్రజ్యోతి):స్థానిక అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలను కొనసాగించాలని పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, స్థానిక ప్రజాప్రతినిధులు ఆందోళన చేశారు. సోమవారం పరిశోధన స్థానాన్ని సందర్శించిన ఎమ్మెల్యే ప్రధాన ద్వారా వద్ద బైఠాయించారు. ఆర్గానిక్ అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలను పునరుద్ధరించాలి, విశ్వవిద్యాలయం అధికారులు జారీ చేసిన ఉత్తర్వులు రద్దు చేయాలని నినాదాలు చేశారు. దీంతో కార్యాలయంలోనున్న ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి బయటకు వచ్చి ఎమ్మెల్యేతో మాట్లాడారు. కళాశాల పునరుద్ధరించాలని జిల్లా కలెక్టర్ దినేశ్ కుమార్ వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడుకి లేఖ రాశారని, విశ్వవిద్యాలయం అధికారులు కళాశాల కొనసాగింపుపై పునరాలోచన చేస్తున్నారని సమాధానం ఇచ్చారు. దీంతో శాంతించని ఎమ్మెల్యే ఉప కులపతికి ఫోన్ చేయాలని పట్టుబట్టారు. దీంతో ఏడీఆర్ విశ్వవిద్యాలయం అధికారులకు ఫోన్ చేసి ఎమ్మెల్యేతో మాట్లాడించారు. మంగళవారం వెబ్ ఆప్షన్ ముగియక ముందుగానే కళాశాలను పునరుద్ధరించాలని, లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని ఎమ్మెల్యే తెలియజేసి, ఆందోళన విరమించారు. ఈ ఆందోళనలో స్థానిక ఎంపీపీ కోరాబు అనుషదేవి, జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, జీకేవీధి ఎంపీపీ బోయిన కుమారి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు దురియా పుష్పలత, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రిలో సౌకర్యాలు మెరుగుపర్చాలి

▸ ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ



రోగులతో మాట్లాడుతున్న ఎ.అజశర్మ

పాడేరురూరల్, జూలై 14(ఆంధ్రజ్యోతి): పాడేరు జిల్లా ఆస్పత్రిలో మెరుగైన సౌకర్యాలను కల్పించాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన జిల్లా ఆస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా రోగులతో మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో మాట్లాడి ఆస్పత్రిలో సిబ్బంది కొరత తదితర సమస్యలపై చర్చించారు. పాడేరు ఆస్పత్రిలో పూర్తి స్థాయిలో వైద్యులు, స్టాఫ్‌నర్సులు లేక ఉన్న సిబ్బందిపై పని వత్తిడి పెరిగిందన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం, సీఐటీయూ నాయకులు ధర్మన్నపడాల్, బాలదేవ్, తిరుపతిరావు, ఎల్.సుందరరావు పాల్గొన్నారు.

డీసీహెచ్ఎస్, చింతపల్లి ఏహెచ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ నీలవేణి



డీసీహెచ్ఎస్ డాక్టర్ నీలవేణి సత్కరిస్తున్న వైద్యులు

చింతపల్లి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆస్పత్రి చిన్నపిల్లల వైద్య నిపుణులు ఎం. నీలవేణి సీహెచ్‌సీ సూపరింటెండెంట్‌గాను, వైద్య విధాన పరిషత్ జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి (డీసీహెచ్ఎస్)గాను సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో చిన్నపిల్లల వైద్యనిపుణులుగా పనిచేస్తూ ఇటీవల ఇక్కడకు బదిలీ అయ్యారు. జిల్లాలోనే సీనియర్ వైద్యాధికారి కావడంతో డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ అధికారులు జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారిగా, చింతపల్లి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈమేరకు జిల్లా కేంద్రంలో డీసీహెచ్ఎస్‌గాను, స్థానిక ఏరియా ఆస్పత్రిలో సూపరింటెండెంట్‌గా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. డాక్టర్ నీలవేణిని స్థానిక వైద్యులు ఘనంగా సత్కరించారు. అనంతరం ఆమె పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజుని మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో పూర్వ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఇందిరా ప్రియాంక, సీనియర్ వైద్యులు వాసవి, శ్రీలత, సంతోష్, చందన, రుక్మిణి, భారతి, అనుష, నర్సింగ్ సూపరింటెండెంట్ పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ చేపట్టాలి

▸ పెదబయలులో ఆందోళన

పెదబయలు, జూలై 14 (ఆంధ్రజ్యోతి):హైకోర్టు ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని రోడ్డుకు ఇరువైపులా వంద అడుగుల మేరకు విస్తరించాలని ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వారు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ బి.వరహాలమ్మ సీపీఎం నేత బి.సన్నీబాబు, స్థానిక సర్పంచ్ మాధవరావు, ఎంపీటీసీ సభ్యుడు బొంజుబాబు మాట్లాడుతూ.. సంత రోజున రోడ్డు ఇరుకు కావడంతో తరచూ ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుందన్నారు. రోడ్డుకు ఇరువైపుల ఆక్రమణలు తొలగించాలని గత నెల 14న జిల్లా కలెక్టర్‌కు విన్నవించిన ఇప్పటికీ స్పందన లేదన్నారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయాలని కోరుతూ డీటీని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు మత్స్యరాజు, బి.గంగాధరం, నాయకులు వెంకటరావు, నీలకంఠం, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

టీచర్లు సమయ పాలన పాటించాలి : డీఈవో



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో బ్రహ్మాజీరావు

జి.మాడుగుల, జూలై 14 (ఆంధ్రజ్యోతి):ఉపాధ్యాయులు సమయ పాలన తప్పక పాటించాలని డీఈవో బ్రహ్మాజీరావు ఆదేశించారు. సోమవారం ఆయన మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రికార్డులను పరిశీలించారు. పదో తరగతి ఎన్‌రోల్‌మెంట్, తదితర అంశాలపై సిబ్బందినిఅడిగి తెలుసుకున్నారు. మెను ప్రకారం మధ్యాహ్న భోజనం అమలు చేయాలని డీఈవో ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ ఎత్తివేత ఉత్తర్వులు రద్దు చేయాలి

▸ గిరిజన ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు సుర్ల లోవరాజు

చింతపల్లి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్గానిక్ అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల ఎత్తివేత ఉత్తర్వులను విశ్వవిద్యాలయం అధికారులు తక్షణమే రద్దు చేయాలని గిరిజన ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు సుర్ల లోవరాజు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామిని కలిసిన గిరిజన ఐక్య వేదిక నాయకులు కళాశాల మూసివేతపై చర్చించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు విలేకరులతో మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలోనున్న ఏకైక అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలను ఎత్తివేయం బాధాకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, వ్యవసాయశాఖ మంత్రి అనుమతి తీసుకోకుండా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఏకపక్షంగా కళాశాలను ఎత్తివేయడం సరైన నిర్ణయం కాదన్నారు. కళాశాలను పునరుద్ధరించాలని, లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో కుడుముల రామకృష్ణ, కంకిపాటి రామారావు, మర్రి సుందరరావు పాల్గొన్నారు.

అనారోగ్యంతో టీడీపీ నేత మచ్చులు మృతి

జి.మాడుగుల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోరాపల్లి పంచాయతీ పెదజాగేరుకి చెందిన టీడీపీ నేత మసాడి మచ్చులు (45) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఈయన రెండు పర్యాయాలు ఎంపీటీసీగా పోటీ చేసి స్వల్ప ఓట్లతో ఓటమి పాలయ్యారు. పంచాయతీలో టీడీపీకి మచ్చులు కీలక నేతగా వ్యవహరించారు. ఈయన మృతి పట్ల పార్టీ శ్రేణులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

'ఆర్‌వీనగర్-పాలగెడ్డ రహదారిని నిర్మించాలి'

సీలేరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఆర్‌వీనగర్-పాలగెడ్డ అంతర్ రాష్ట్ర రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కి లేఖ రాసినట్టు మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఆర్‌వీనగర్, పాలగెడ్డ రహదారి అత్యంత అధ్వానంగా తయారైందన్నారు. ఈ రహదారి నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్టు చెబుతున్నప్పటికి ఆర్అండ్‌బీ అధికారులు నిధులు లేవని చెబుతున్నారన్నారు. ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యను గుర్తించి రహదారి నిర్మాణానికి కృషి చేయాలని కోరామన్నారు.

పశువుల శాలగా.. సామాజిక భవనం



అనంతగిరిలో గల సామాజిక భవనం

అనంతగిరి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం అనంతగిరిలో సామాజిక భవనం పశువుల శాలగా మారింది. గతంలో ఇక్కడ ఈ భవనం లేకపోవడంతో వివాహాలు తదితర శుభకార్యాల నిర్వహణకు మండలవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. 2003లో అప్పటి ఎంపీగా పనిచేసిన ఎంవీవీఎస్ మూర్తి తన ఎంపీ నిధులు 5.5 లక్షలను కేయించి సామాజిక భవనం నిర్మాణం చేపట్టారు. పదిహేనేళ్ల పాటు పెళ్లిలు, ప్రభుత్వ కార్యక్రమాలు, సమావేశాలకు బాగానే ఉపయోగిపడింది. దీని నిర్వహణను పట్టించుకునేవారు కరువయ్యారు. దీంతో ప్రస్తుతం ఇది అసాంఘిక కార్యకపాలకు అడ్డగా మారింది. అంతేకాకుండా తలుపు లేకపోవడం వల్ల వర్షకాలంలో పశులకు స్థావరంగా మారింది. కిటికీలు, రెండు తలుపులు వేయించి, మరమ్మతులు చేయిస్తే భవనం అన్నివిధాలుగా ఉపయోగడపుతుందని పలువురు చెపుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, భవనం అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



భవనం నిరుపయోగంగా మారడంతో పశువులను కట్టిన దృశ్యం

హైడ్రో పవర్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా
గిరిజనుల భారీ ర్యాలీ

▸ పలు గ్రామాల నుంచి తరలి రాక



ప్రాజెక్టుకు వ్యతిరేకంగా గుమ్మకోటలో భారీ ర్యాలీ చేపడుతున్న గిరిజనులు

అనంతగిరి, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుమ్మకోట పంచాయతీ కేంద్రంలో హైడ్రో పవర్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా గుమ్మకోట, గుజ్జెలి, బుదరగెడ్డ, దబ్బలపాడు, చిప్పపల్లి, లోగుమ్మకోట, భీమవరం, శంకుపర్తి, బూర్జవలస తదితర గ్రామాల గిరిజనులు సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారంతా 'హైడ్రో పవర్ ప్రాజెక్టు వద్దు.. పచ్చని పంట పొలాలే ముద్దు' అంటూ నినాదాలు చేశారు. అనంతరం సర్పంచ్ పాగి అప్పారావు మాట్లాడుతూ హైడ్రో పవర్ ప్రాజెక్టు వల్ల గిరిజనులు అన్నివిధాలా నష్టపోతారన్నారు. గతంలో తాటిపూడి, రైవాడ, ఆంధ్ర జలాశయాల్లో అనేక గ్రామాలు ముంపునకు గురైనా ఎటువంటి ఉపాధి కల్పించలేదన్నారు. ప్రాజెక్టు వలన పలు గ్రామాలు ఖాళీ చేయాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఈ విషయంలో పునరాలోచించాలని కోరారు. జీవో 51ను రద్దు చేసి, గిరిజనుల పక్షంగా నిలవాలన్నారు. ఈ సమస్యపై వెంటనే స్పందించాల్సిందిగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలోమాజీ ఎంపీటీసీ కొండమ్మ, ఉప సర్పంచ్ కన్నయ్య, పెరుమాల మహేశ్, అప్పలస్వామి,తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

▸ 'సుపరిపాలనలో తొలి అడుగు'లో టీడీపీ నేతలు శ్రావణ్‌కుమార్, దొన్నుదొర



పద్మాపురంలో పథకాలను వివరిస్తున్న జీసీసీ చైర్మన్ శ్రావణ్‌కుమార్



ముంచంగిపుట్టులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి దొన్నుదొర

అరకులోయ, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలన్నదే కూటమి ప్రభుత్వం లక్ష్యమని జీసీసీ చైర్మన్, టీడీపీ అరకు పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జి కిడారి శ్రావణ్‌కుమార్ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన మండలంలోని పద్మాపురంలో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ఏడాది కూటమి పాలనలో సాధించిన విజ యాలను వివరించారు. గత వైసీపీ ప్రభుత్వం ఖజానాను ఖాళీ చేసి రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చినప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తనకున్న పరిపాలనా అనుభవంతో రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో గాడిలో పెడుతున్నారన్నారు. ఇందులో భాగంగానే అభివృద్ధి కార్యక్రమాలు చేపడతూ, అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నట్టు చెప్పారు. పార్టీ మండల అధ్య క్షుడు లకోయి మహాదేవ్, పెదలబుడు, దారెల, బాకూరు, శోభకోట సర్పంచ్‌లు దాసుబాబు, పాంగి పాండురంగస్వామి, బాకూరు వెంకటరమణ, పలాసి శశిభూషణం, మాజీ వైస్ ఎంపీపీ పొద్దు అమ్మన్న, పద్మాపురం పంచాయతీ టీడీపీ సీనియర్ నాయకులు సాయిరాం, తెలుగు యువత ప్రధాన కార్యదర్శి రమేష్, చందూ, నాగరాజు, కామేష్, అప్పలరాజు, మహిళా నాయకురాళ్లు కళావతి, నూకరత్నం, ద్రౌపది, విన్నేతి దీనసౌజన్య, విజయకుమారి పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు మండలంలో...

ముంచంగిపుట్టు : అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం సమ ప్రాధాన్యం ఇస్తోందని ఆర్టీసీ విజయనగరం రీజనల్ చైర్మన్, టీడీపీ అరకు నియోజకవర్గ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర అన్నారు. మండల కేంద్రం ముంచంగిపుట్టుతో పాటు మారుమూల గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం పర్యటించారు. ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. ప్రతి పేదవాడి కళ్లలో ఆనందం చూడడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కె.బలరాం, ప్రధాన కార్యదర్శి కె.జగత్‌రాయ్, అరకు పార్లమెంట్ కార్యనిర్వాక కార్యదర్శి పి.కామేశ్వరరావు, పార్లమెంట్ మహిళా ఉపాధ్యక్షురాలు కె.సన్యాసమ్మ, సర్పంచులు వి.లక్ష్మణ్, వి.ధనియా, నాయకులు వి.రామస్వామి, ఎస్.బాబూజీ, ఎం.చిన్ని, బి.రామారావు, వి.జగదీశ్, కె.పద్మనాభం, వి.గోపాల్, కె.కామరాజు తదితరులు పాల్గొన్నారు.

కాఫీ రైతులకు గరిష్ఠ ధరలు : జీసీసీ డీఎం

గూడెంకొత్తవీధి, జూలై 14 (ఆంధ్రజ్యోతి):కాఫీ రైతులకు జీసీసీ గరిష్ఠ ధరలు అందించిందని చింతపల్లి డివిజనల్ మేనేజర్ బుక్కా వెంకటేశ్ అన్నారు. సోమవారం జీకేవీధి జీసీసీ గోదామును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం సేల్స్‌మెన్‌తో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఏడాది కాఫీ పార్చిమెంట్, చెర్రీకి ప్రైవేటు వర్తకుల కంటే రూ.50-80ధరలు అధికంగా రైతులకు అందజేశామన్నారు. జీసీసీ కాఫీ గింజలు అప్పగించి వెంటనే రైతుల బ్యాంక్ ఖాతాల్లో నగదు జమ చేశామన్నారు. మండలంలో కొంత మంది రైతులు కాఫీ గింజల విక్రయాలకు సంబంధించిన నగదు అందలేదని పత్రికల్లో వార్తలు వచ్చాయన్నారు. ఈమేరకు జీసీసీ సేల్స్‌మన్, సేకరణ ఉద్యోగులతో విచారణ చేపట్టామన్నారు. గిరిజనులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి, జీకేవీధి బ్రాంచి మేనేజర్ చల్లంగి సుగునాథం, సరమండ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

వలజంగిలో
జ్వరాల విజృంభణ

▸ ఏ ఇంట చూసినా జ్వరపీడితులే

▸ నాలుగేళ్ల బాలిక మృతిచెందినట్టు గ్రామస్థులు ఆవేదన



జ్వరంతో బాధపడుతున్న బాలుడు, మహిళ

ముంచంగిపుట్టు, జులై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగబయలు పంచాయతీ వలజంగి గ్రామంలో జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఏ ఇంటి చూసినా జ్వరపీడితులే కనిపిస్తున్నారు. శరీరంపై కురుపులు, జ్వరంతో బాధపడుతున్నారు. ఆ గ్రామానికి చెందిన వి.తులసి అనే నాలుగేళ్ల చిన్నారి గత కొద్ది రోజులుగా జ్వరంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందిందని గ్రామస్థులు తెలిపారు. ప్రస్తుతం వి.కనుమ, వి.రాధ, వి.మీనా, వి.సుశాంత్ అనే చిన్నారులతో పాటు మరో పది మంది జ్వరం, ఇతర ఆరోగ్యపర సమస్యలతో బాధపడుతున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా అంతా కోరుతున్నారు.



మేడివాడ వద్ద బీఎన్ రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజు

బీఎన్ రోడ్డు అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేయండి: ఎమ్మెల్యే రాజు

రావికమతం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): బీఎన్ రోడ్డు అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. మండలంలోని మేడివాడ వద్ద జరుగుతున్న ఈ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. రోడ్డు నిర్మాణ పనులపై కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. అనంతరం విలేకరులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ నర్సీపట్నం-భీమునిపట్నం రోడ్డులో చోడవరం మండలం వెంకన్నపాలెం నుంచి వడ్డాది వరకు 11 కిలోమీటర్లు రూ.23 కోట్లతోను, బుచ్చెయ్యపేట మండలం బంగారుమెట్ట నుంచి రోలుగుంట మండలం వెలంకాయలపాలెం వరకు 29 కిలోమీటర్ల రోడ్డును రూ.46 కోట్లతో నిర్మించేందుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చినట్టు చెప్పారు. ముందుగా రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న చోట రోడ్డు పనులు చేపడుతున్నామన్నారు. తరువాత బీటీ రోడ్డు అభివృద్ధి చేస్తామని ఆయన తెలిపారు. ఆయన వెంట టీడీపీ నేత గొర్లె సాంబశివ ఉన్నారు.

గిరిజన యువతికి ఎమ్మెల్యే పరామర్శ



ఆస్పత్రిలో బాలింతను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

రోలుగుంట, జూలై 14 (ఆంధ్రజ్యోతి): లోసింగికి రోడ్డు నిర్మించి గిరిజనులకు డోలీమోతలు లేకుండా చూస్తామని ఎమ్మెల్యే రాజు హామీ ఇచ్చారు. 'గర్భిణికి తప్పని డోలీ మోత' అనే శీర్షికన సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ఈ మేరకు ఏరియా ఆసుపత్రిలో వైద్య సేవలు పొందుతున్న బాలింత పాంగి సాయిని టీడీపీ మండల అధ్యక్షుడు పంచాడ చంద్ర, రోలుగుంట ఎంపీటీసీ సభ్యుడు సుర్ల రామకృష్ణతో కలిసి పరామర్శించారు. సాయికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. మెరుగైన సేవలు అందించాలని వైద్యాధికారులను కోరారు. కొత్తలోసింగి, పాత లోసింగి, పెదగరువు, పిత్రిగెడ్డ గ్రామాలకు రోడ్డు నిర్మిస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

సమస్యలు పరిష్కరించాలని విద్యార్థుల ర్యాలీ



ప్రధాన రహదారిపై ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

నర్సీపట్నం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం విద్యార్థులు పట్టణంలో ర్యాలీ చేశారు. ఆర్టీసీ కూడలి నుంచి అబీద్ సెంటర్ వరకు వివిధ కళాశాలల విద్యార్థులు ర్యాలీ సాగించారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేసి ఆర్డీవోకు వినతి పత్రం అందజేశారు. డిగ్రీ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేయాలని, వసతిగృహాల్లో సదుపాయాలు మెరుగుపరచాలని, మెస్‌చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. ఉపకార వేతనాలు బకాయిలు విడుదల చేయాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గౌతం, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై విచారణ చేయాలని ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఉపాధి కూలీలు

బుచ్చెయ్యపేట, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేజర్ పంచాయతీ వడ్డాదిలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులపై విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ అనకాపల్లి కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (స్పందన)లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సీ సెల్ జిల్లా యువజన అధ్యక్షుడు బూసకోటి మాట్లాడుతూ ఉపాధి పనులు చేస్తున్న కూలీల పట్ల టెక్నికల్ అసిస్టెంట్ ఆనంద్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. నిబంధనలకు మించి కొలతలు పెంచి తప్పమని చెపుతున్నారని ఆరోపించారు. వారం రోజుల పనులకు మస్తర్లు వేయలేదన్నారు. అలాగే మొక్కల బిల్లులు మంజూరులో కూడా అవమానం జరిగిందని ఆయన ఆరోపించారు. వీటిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

వినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు, భక్తులు

రావికమత ం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): అత్యంత మహిమాన్వితమైన టి.అర్జాపురం బాల వరసిద్ధి వినాయకుని ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంకష్టహర చతుర్థి శుభ పర్వదినం, ఆషాఢ మాసం, కృష్ణ పక్షం సందర్భంగా లోక కల్యాణం కోసం, వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని కోరుకుంటూ ఆలయ అర్చకులు గుంటూరు లక్ష్మణరావు, రామారావు ఆధ్వర్యంలో ఈ పూజలు, అభిషేకాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సాంఘిక సంక్షేమ శాఖ గురుకులాల్లో మిగులు సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ రేపు

కొత్తూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యా సంస్థల్లో ఐదో తరగతి నుంచి ఇంటర్ వరకు మిగిలిన ఖాళీ సీట్ల భర్తీకి అనకాపల్లి గురుకులంలో మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహిస్తామని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల విశాఖపట్నం జిల్లా సమన్వయాధికారి ఎన్.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. బాలురకు ఉదయం 9 గంటలకు, బాలికలకు మధ్యాహ్నం ఒంటిగంటకు కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. దేవరాపల్లి, గొలుగొండ, సబ్బవరం, శ్రీకృష్ణాపురం బాలుర గురుకులాలు, మేహాద్రిగెడ్డ, సీహోఈ, నక్కపల్లి, కోనాం, నర్సీపట్నం, తాళ్లపాలెం, కొక్కిరాపల్లి బాలికల గురుకులాల్లోని ఖాళీల భర్తీకి అభ్యర్థులు హాజరుకావాల్సి ఉంటుందని చెప్పారు.

పీజీఆర్ఎస్ అర్జీలు సత్వరమే పరిష్కరించండి

» నర్సీపట్నం ఆర్డీవో వీవీ రమణ



గ్రీవెన్స్‌లో అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో వీవీ రమణ

నర్సీపట్నం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని ఆర్డీవో వీవీ రమణ అధికారులకు ఆదేశించారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో 22 అర్జీలు వచ్చాయి. నర్సీపట్నానికి చెందిన మందపల్లి పద్మజ తల్లికి వందనం డబ్బులు పడలేదని, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చూపించడం లేదని ఫిర్యాదు చేశారు. అలాగే నర్సీపట్నానికి చెందిన కొత్తూరు నాగమణి, షేక్ ఇర్ఫానీ తల్లికి వందనం డబ్బులు బ్యాంకు ఖాతాలో జయకాలేదని, పేమెంట్ హోల్డ్‌లో పెట్టినట్టు చూపిస్తున్నదని అర్జీ అందజేశారు. మాకవరపాలెం మండలం మల్లవరంలోని 84 సెంట్ల భూమిని తన కూతురుకు పసుపు కుంకాలుగా రాసిచ్చానని, ఆ భూమిని తన అన్నదమ్ములు వారి పేరు మీద ఆన్‌లైన్ చేయించుకున్నారని బిక్కవోలు మండలం పందలపాక గ్రామానికి చెందిన కచ్చాల లక్ష్మి ఫిర్యాదు చేశారు. తన తల్లి అడిగర్ల చిట్టమ్మ తనకు పసుపుకుంకాలు కింద రాసిందని, ఆ భూమినే తన కూతురు ఝాన్సీరాణి పేరు మీద రాశానని పేర్కొన్నారు. న్యాయం చేయాలని కచ్చాల లక్ష్మి కోరారు. నర్సీపట్నం మండలం దుగ్గాడ గ్రామంలోని ఎనిమిది ఎకరాల భూమిని తనకు తెలియకుండా కుటుంబ సభ్యులు ఆన్‌లైన్ చేయించుకున్నారని, ఈ సమస్యను పరిష్కరించాలని నల్లబిల్లి సన్యాసమ్మ కోరారు. రోలుగుంట రెవెన్యూలోని 1.9 ఎకారల భూమిని ఆన్‌లైన్ చేయాలని ఎం.గీత వినతిపత్రం అందజేశారు. వర్షాలు పడకపోవడంతో నారుమడులు ఎండిపోతున్నాయని, రావణాపల్లి రిజర్వాయర్ నుంచి లీక్ అవుతున్న నీటిని కాలువల్లోకి విడిచిపెడితే నారు తడపుకుంటారని కురచ జోగినాయుడు విన్నవించారు. ఈ వినతులను ఆయా శాఖల అధికారులకు ఆర్డీవో బదలాయించారు. వీటిని పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

సుపరిపాలన తెలుగుదేశం పార్టీతోనే సాధ్యం

» ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి



గుల్లేపల్లి గ్రామంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు

కె.కోటపాడు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఏడాది పాలనలో ప్రజలకు ఉపయోగపడే పథకాలు అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని, సుపరిపాలన ఒక్క తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మండలంలోని గుల్లేపల్లి గ్రామంలో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. అనంతరం కూటమి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించారు. అలాగే సంక్షేమ పథకాలు సకాలంలో అందుతున్నాయా... లేదా అని అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసమే పనిచేస్తున్నదన్నారు. ప్రభుత్వ పథకాలు అందుతున్న విధానంపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. పథకాలకు అర్హులైన వారు సచివాలయానికి వెళ్లి వివరాలు అప్‌డేట్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రొంగలి మహేశ్, నాయకులు సబ్బవరపు రామునాయుడు, పూడి నారాయణమూర్తి, దాడి ఎరుకునాయుడు, కశిరెడ్డి దేముడుబాబు, తంగేటి శ్రీను, గొర్లి శంకరరావు, బి.ప్రసాద్, వి.మల్లికదేవి, కె.గంగరాజు, ఆర్.శ్రీరామమూర్తి, కన్నూరు సూర్యనారాయణ, బొడ్డు అక్కునాయుడు, కశిరెడ్డి అప్పలనాయుడు, పూడి శ్రీను, వెలగల పైడమునాయుడు, వంటాకు శ్రీను, బండారు దేముడుబాబు, కె.నారాయణమూర్తి, పైలా గోపి పాల్గొన్నారు.

క్వారీ అనుమతులు రద్దు చేయాలని నిరసన



క్వారీ అనుమతులు రద్దు చేయాలని నినాదాలు చేస్తున్న దళితులు

మాకవరపాలెం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): జి.కోడూరు రెవెన్యూలో ఉన్న నల్లరాయి క్వారీ అనుమతులు రద్దు చేయాలని దళితులు ఆందోళనకు దిగారు. సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం క్వారీ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ జి.కోడూరు రెవెన్యూలో దళితులకు ప్రభుత్వం డి.పట్టాలు మంజూరు చేసిందన్నారు. అయితే 332 సర్వే నంబరులో ఇటీవల ప్రభుత్వం నల్లరాయి క్వారీ తవ్వకాలకు అనుమతులు ఇచ్చిందన్నారు. ఈ తవ్వకాల వల్ల దళితులు సాగుచేస్తున్న డి.పట్టా భూముల్లో జీడివ, మామిడి తోటలు పూర్తిగా దెబ్బతింటున్నాయన్నారు.పంట భూములు ఉన్న చోట క్వారీ అనుమతులు ప్రభుత్వం ఇవ్వకూడదని, దీనిని వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేసి, తహసీల్దార్ వెంకటరమణకు వినతిపత్రం అదంజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు, ఈరెల్లి చిరంజీవి, దళిత రైతులు పాల్గొన్నారు.

సుందర భవనం... నిరుపయోగం!

కె.కోటపాడులో అలంకారప్రాయంగా బాలికల వసతి గృహ నూతన భవనం



అలంకారప్రాయంగా మిగిలిన కె.కోటపాడు బాలికల వసతిగృహం

కె.కోటపాడు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కొత్తగా నిర్మించిన బాలికల వసృతిగృహ భవనం అలంకారప్రాయంగా దర్శనమిస్తోంది. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 2019లో రూ.1.94 కోట్లతో కె.కోటపాడు ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ భవనాన్ని నిర్మించారు. భవనం అన్ని విధాలుగా పూర్తయింది. అయితే అప్పట్లో ఎన్నికల కోడ్ నియమావళితో భవనాన్ని ప్రారంభించలేదు. అనంతరం వైసీపీ అధికారంలోకి రాగా, 2020 సెప్టెంబరు 5న అప్పటి ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ఎంతో అట్టహాసంగా ఈ భవనాన్ని ప్రారంభించారు. అప్పటి నుంచి దీన్ని వినియోగంలోకి తీసుకురాకపోవడంతో అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నది.

ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఇటీవల భవనాన్ని పరిశీలించి ఈ విద్యా సంవత్సరం నుంచి వినియోగంలోకి తీసుకువస్తామని ప్రకటించారు. ప్రభుత్వం ఈ వసతి గృహాన్ని కాస్త మార్పులు చేసి కేజీబీవీ టైప్ ఫోర్ పేరుతో 8, 9, 10 తరగతులతో పాటు ఇంటర్ విద్యార్థినులు వసతిగృహంలో చదివేలా ప్రణాళిక రూపొందించారు. వసతిగృహంలో చేరటానికి విద్యార్థినులు కూడా సిద్ధంగా ఉన్నప్పటికీ, సిబ్బంది లేకపోవడంతో నిరుపయోగంగా వదిలేశారు. ఈ విషయమై ఎంఈవో సత్యనారాయణను ప్రశ్నించగా, ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి దృష్టికి తీసుకువెళ్లి త్వరలో ఈ భవనాన్ని వినియోగంలోకి తీసుకు వస్తామని తెలిపారు.

ఇద్దరి ప్రాణాలను కాపాడిన మెరైన్ పోలీసులు

ఎస్.రాయవరం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేవుపోలవరం సముద్రతీరంలో మునిగిపోతున్న ఇద్దరి ప్రాణాలను పెంటకోట మెరైన్ పోలీసులు స్థానిక మత్స్యకారులతో కలిసి కాపాడారు. ఎలమంచిలి మండలం పురుషోత్తపురం గ్రామానికి చెందిన రాజాన రమణమ్మ, పోలిరెడ్డి ప్రభళిక సముద్రస్నానం ఆచరించడానికి రేవుపోలవరం సముద్రతీరానికి వెళ్లారు.

ఇద్దరూ సముద్రంలో స్నానమాచరిస్తుండగా ఒక్కసారిగా వచ్చిన అలల తాకిడికి మునిగిపోతుండగా అక్కడే గస్తీ నిర్వహిస్తున్న మెరైన్ పోలీసులు, స్థానిక మత్స్యకారులతో కలిసి వారిని బయటకు తీసుకొచ్చారు. ప్రథమ చికిత్స అందించిన అనంతరం నక్కపల్లి ప్రభుత్వ ఆస్పతికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం రమణమ్మను అనకాపల్లి ఎన్‌టీఆర్ ఆస్పత్రికి తరలించారు. వీరిద్దరూ ఆరోగ్యంగా ఇంటికి చేరుకున్నారని కుటుంబ సభ్యులు తెలిపారు.

అన్యమత ప్రచారానికి అడ్డుకట్ట

» కొల్లివానిపాలెంలో రువర్గాల వాగ్వాదం

» గ్రామస్థులపై రాయితో దాడి చేయడానికి బాలుడు యత్నం

» తప్పయిందని చెప్పి వెళ్లిపోయిన అన్యమత ప్రచారకులు

అచ్యుతాపురం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దోసూరు పంచాయతీ శివారు కొల్లివానిపాలెంలో అన్యమత ప్రచారకులు రెండు ఆటోల్లో సోమవారం వచ్చారు. మైకుల్లో ప్రచారం చేస్తూ కరపత్రాలు పంచడానికి ప్రయత్నించారు.

దీంతో గ్రామస్థులు వారిని అడ్డుకు న్నారు. ఇక్కడ ప్రచారం చేయకుండా వెళ్లిపోమ్మని కోరారు. అందుకు అన్యమత స్థులు గ్రామస్థులతో వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా ఒక అన్యమత బాలుడు పెద్ద సిమెంటు ఇటుకను తీసి వాగ్వాదానికి దిగిన వారిపై దాడి చేయడానికి ప్రయత్నించాడు. దీనిని గమనించిన కొల్లివానిపాలెం గ్రామస్థులు దాడి చేయడానికి ప్రయత్నించిన బాలుడిని పట్టుకున్నారు.

దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని నిర్ణయించారు. మొత్తం విషయాన్ని వీడియో తీశామని గ్రామస్థులు పేర్కొన్నారు. మతం పేరుతో చిన్నపిల్లలను కూడా క్రూరులుగా మారుస్తున్నారని మండిపడ్డారు. దాడికి యత్నించిన బాలుడిపై పోలీస్ కేసు పెడతామని గ్రామస్థులు పట్టుబట్టారు. దీంతో అన్యమతస్థులు గ్రామస్థులను బతిమలాడి తాము వచ్చిన ఆటోల్లో వెళ్లిపోయారు.

పైనాపిల్‌కు పెరిగిన గిరాకీ

» వారపు సంతలో గత వారం రూ.4.... ఈ వారం రూ.15



మాడుగుల వారపు సంతలో విక్రయించేందుకు తీసుకు వచ్చిన పైనాపిల్

మాడుగుల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సోమవారం జరిగిన వారపు సంతకు ఏజెన్సీ నుంచి గిరి రైతులు తీసుకొచ్చిన పైనాపిల్‌కు గిరాకీ పెరిగింది. మాడుగుల పాడేరు ఏజెన్సీలోని దేవాపురం, సలుగు, కందులపాలెం, ఈదులపాలెం, వంట్లమామిడి, కక్కి వంటి పలు గిరిజన ప్రాంతాల నుంచి గిరిజన రైతులు ఇక్కడికి పైనాపిల్ తీసుకొని వచ్చారు. కొనుగోలుదారులు అధికంగా రావడంతో ధర బాగానే పెరిగింది. ఒక్కో పైనాపిల్ పండు రూ.15 నుంచి రూ.18 వరకు అమ్ముడుపోయింది. అంతే కాకుండా ఉదయం 9 గంటలకే సంత ముగిసిపోవడం విశేషం. గత వారం ఒక్కో పైనాపిల్ రూ.4కే ధర పలికింది. గత వారం డీలాపడ్డ రైతులు, ఈ వారం ధర అధికంగా పెరగడంతో ఆనందం వ్యక్తం చేశారు. అలాగే పనసపండు ధర రూ.50 పలికింది.

లోపూడిలో మోటారు మరమ్మతు



మోటారు మరమ్మతు చేస్తున్న దృశ్యం

బుచ్చెయ్యపేట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లోపూడి గ్రామంలో మోటారుకు సోమవారం మరమ్మతు చేశారు. 'లోపూడిలో దాహం కేకలు' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి సర్పంచ్ ఎం.కుమారి, ఎంపీటీసీ సభ్యుడు ఎల్లపు జగ్గ, పంచాయతీ కార్యదర్శి రామిరెడ్డి స్పందించారు. ఈ మేరకు మోటారును బాగు చేయించారు. సోమవారం యథావిధిగా తాగునీరు సరఫరా కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

నీటి తీరువా వసూళ్ల లక్ష్యాలు సాధించాలి: తహసీల్దార్

రావికమతం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): నీటి తీరువా వసూళ్ల లక్ష్యాలను సాధించాలని తహసీల్దార్ అంబేడ్కర్ ఆదేశించారు. తన కార్యాలయంలో వీఆర్వోలతో సోమవారం ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని మేడివాడ, కొత్తకోట, టి.అర్జాపురం తదితర గ్రామాల్లో రూ.14.9 లక్షల నీటి తీరువా వసూలు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఆయా గ్రామాల వీఆర్వోలు ఈ లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. అలాగే తహసీల్దార్ కార్యాలయానికి అందిన వివిధ వినతులను పరిశీలించి తగిన నివేదిక ఇవ్వాలన్నారు. వీటిని ఇప్పటికే సంబంధిత వీఆర్వోల లాగిన్‌కు పంపామన్నారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుని నిర్మించిన ఇళ్లకు అభ్యంతరం లేకపోతే క్రమబద్ధీకరించామని, దీనికి సంబంధించి ఇప్పటికే అందిన దరఖాస్తులను పరిశీలించాలని తహసీల్దార్ తెలిపారు. ఇళ్ల స్థలాలకు అందిన దరఖస్తుదారులకు గ్రామంలో ఖాళీ స్థలం ఉంటే కేటాయించాలని, లేకపోతే ఇతర గ్రామాల్లో ఇచ్చేందుకు తగిన చర్యలు తీసుకుంటామని ఆయన సూచించారు.

విద్యార్థినులకు నైపుణ్య శిక్షణ

చీడికాడ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇస్తామని చుక్కపల్లి పాఠశాల హెచ్‌ఎం బీవీ.రమణ చెప్పారు. ఈ ఏడాది ఆరో తరగతిలో చేరిన విద్యార్థుల కుటుంబీలకు సోమవారం పుస్తకాలు, బ్యాగులు అందించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులకు ఆయన పలు సూచనలు చేశారు.

పింఛనుదారుల ధర్నాకు తరలిరండి

చోడవరం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పింఛనుదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 15న అనకాపల్లిలో చేపట్టనున్న ధర్నాకు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ పింఛనుదారుల సంఘం చోడవరం యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు వి.చినబాబు, బి.దక్షిణామూర్తి సోమవారం విజ్ఞప్తి చేశారు. అనకాపల్లిలోని నెహ్రూ చౌక్ ఈ ధర్నా నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

ఈవ్‌టీజింగ్‌పై విద్యార్థినులకు అవగాహన

కె.కోటపాడు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఈవ్‌టీజింగ్‌పై విద్యార్థినులకు పోలీసులు అవగాహన కల్పించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో వివిధ రకాల మోసాలను విద్యార్థినులకు వివరించారు. గృహహింస, ఉద్యోగుల వేధింపు, వరకట్న వేధింపులు తదితర అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. తక్షణ సహాయం కోసం 112, 181, 1930, 1098 ఫోన్ చేయాలని వారు తెలిపారు.

జూనియర్ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

దేవరాపల్లి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ బి.రాధ తెలిపారు. జనరల్ కోర్సులో కెమిస్ట్రీ, ఒకేషనల్ కోర్సులో ఈటీ సబ్జెక్టులు, కెమిస్ట్రీ పోస్టుకు ఎం.ఎస్సీ 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత, ఈటీ కోర్సులో బి.టెక్, ఈఈఈలో 50 శాతం మార్కులు ఉండాలని చెప్పారు. అర్హత కలిగిన అభ్యర్థులు మంగళవారం మధ్యాహ్నం 3 గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనకాపల్లి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కార్యాలయంలో ఈ నెల 16వ తేదీన ఇంటర్వ్యూలు జరుగుతాయని ఆమె తెలిపారు.

రాయితీపై పశుగ్రాస విత్తనాలు

మాడుగుల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రాయితీపై పశుగ్రాస విత్తనాలు పంపిణీ చేస్తున్నట్టు పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు వి.చిట్టినాయుడు తెలిపారు. పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా స్థానిక మరిడిమాంబ కాలనీలో సోమవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులకు 75 శాతం ఈ విత్తనాలు అందిస్తున్నట్టు చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు సర్వసభ్య సమావేశం

మాడుగుల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తామని ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. ఉదయం పది గంటలకు ప్రారంభంకానున్న ఈ సమావేశానికి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి హాజరవుతారన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు తప్పనిసరిగా పాల్గొనాలని ఆయన సూచించారు.

మునగకొండ వద్ద గ్రావెల్ తవ్వకాలను అడ్డుకున్న పోలీసులు

సబ్బవరం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): గ్రావెల్ తవ్వకాలకు రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారుల అనుమతులు తప్పనిసరిగా ఉండాలని ఎస్ఐ దివ్య అన్నారు. గాలి భీమవరంలో గత ప్రభుత్వం పేదల ఇళ్ల నిర్మాణాలకు రైతుల వద్ద నుంచి భూమిని సేకరించింది. పరిహారంగా ఆ రైతులకు డి.పట్టా భూములు ఎకరాకు 900 గజాలు, ఆక్రమణ భూములు ఎకరాకు 450 గజాలు ప్లాట్లుగా వేసి ఇచ్చింది. సమీపంలోని గాలిభీమవరం సర్వే నం బరు 61లో గల మునగకొండ నుంచి గత రెండు రోజులుగా యంత్రాలతో గ్రావెల్ తవ్వి ట్రాక్టర్ల ద్వారా తరలించి ఆయా ప్లాట్లను పూడ్చుతున్నారు. దీనిపై అందిన సమాచారం మేరకు ఎస్ఐ సోమవారం సిబ్బందితో అక్కడికి చేరుకుని గ్రావెల్ తవ్వకాలను అడ్డుకున్నారు. గ్రావెల్ తవ్వ కాలకు రెవెన్యూ, మైనింగ్ అధికారుల అనుమతులు తప్పనిసరిగా పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

చెత్త తరలింపునకు గ్రీన్‌సిగ్నల్

రావికమతం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో పది గ్రామ పంచాయతీలలో పేరుకుపోతున్న చెత్తను నర్సీపట్నం మునిసిపాలిటీకి తరలించేందుకు పంచాయతీరాజ్ కమిషనర్ నుంచి ఉత్తర్వులు వచ్చాయని ఈవోపీఆర్‌డీ సీతారామస్వామి తెలిపారు. మండలంలో రావికమతం, మేడివాడ, కొత్తకోట, తట్టబంద, చినపాచిల తదితర పది పంచాయతీల్లోని డంపింగ్ యార్డు కేంద్రాలలో పేరుకుపోయిన చెత్తను సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ చెత్తను నర్సీపట్నంలోని విద్యుత్ తయారీ కేంద్రానికి వారంలో ఒక రోజు ఒకసారి తరలిస్తామని ఆయన తెలిపారు.

చెలరేగిపోతున్న భూ కబ్జాదారులు

- పెందుర్తి మండలం నరవలో గెడ్డ పోరంబోకులో ఇళ్ల నిర్మాణం
- రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షలకు విక్రయం
- గవర జగ్గరాజుపాలెంలో ప్రభుత్వ స్థలాలు,
- గ్రామ కంఠం భూములు అమ్మకం
- సత్తివానిపాలెంలో లక్ష్మీసాగర్ చెరువు ఆక్రమణ యత్నం
- ఆక్రమణదారులకు రాజకీయ నేతలు, ప్రజా ప్రతినిధుల అండదండలు
- రెవెన్యూ, పంచాయతీ, జీవీఎంసీ అధికారుల మొద్దునిద్ర


నరవలో గెడ్డ పోరంబోకు స్థలంలో ఇళ్ల నిర్మాణం కోసం పునాదులు


సత్తివానిపాలెంలో లక్ష్మీసాగర్ చెరువు ఆక్రమణకు లెవెలింగ్

విశాఖపట్నం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): **నగర శివారు ప్రాంతాల్లో భూ కబ్జాదారులు చెలరేగిపోతున్నారు. చెరువులు, వాగులు, గెడ్డలు, కొండ పోరంబోకు భూములు, గ్రామ కంఠం భూములను ఆక్రమించుకుంటున్నారు. అందుకు రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు వారి బంధువులు అండగా నిలుస్తున్నారు.**

పెందుర్తి మండలంలోని పలు గ్రామాల్లో కొండ పోరంబోకు భూములు కొట్టేయడానికి చేస్తున్న ప్రయత్నాలను 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకువచ్చిన విషయం తెలిసిందే. అయితే అటువంటి ఆక్రమణలు అనేకం ఉన్నాయని ఆ నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి కొందరు సమాచారం అందించారు. నరవ గ్రామంలోని సర్వే నంబర్ 36లో ప్రభుత్వ గెడ్డవాగు సుమారు 1.7 ఎకరాలు ఉంది. దీనిని రెవెన్యూ రికార్డుల్లో గెడ్డగా క్లాసిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఖాతా నంబరు 20001202. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు గెడ్డవాగుల్లో ఎవరికీ పట్టాలు ఇవ్వకూడదు. నిర్మాణాలు చేయకూడదు. కానీ గ్రామానికి చెందిన కొందరు కొద్దికొద్దిగా ఆక్రమించుకుని ఇళ్లు నిర్మించి, ఒక్కొక్కటి రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షలకు విక్రయిస్తున్నారు. ప్రభుత్వ గెడ్డ అని తెలియక కొనుగోలుచేసినవారు...తరువాత విషయం తెలుసుకుని లబోదిబోమంటున్నారు. గెడ్డవాగులో నిర్మాణాలు చేస్తున్నా రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది కనీసం అడ్డుకునే ప్రయత్నం చేయడం లేదు.

గవర జగ్గరాజుపాలెంలో గ్రామానికి ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలాలు, గ్రామ కంఠాన్ని కొందరు చోటా నాయకులు ఆక్రమించుకుని ఇళ్లు నిర్మిస్తున్నారు. జీవీఎంసీ ప్రణాళికా విభాగం అధికారులు, సిబ్బంది కనీసం పట్టించుకోవడం లేదు. రెవెన్యూ సిబ్బంది కొద్దిరోజుల క్రితం వచ్చి ప్రభుత్వ స్థలంలో నిర్మించిన ఇంటికి తూతూమంత్రంగా నాలుగు సిమెంటు పలకలు తొలగించి వెళ్లిపోయారు. అక్కడ కూడా ఇళ్లు నిర్మించి రూ.20 లక్షలకు అమ్ముకుంటున్నారు. చోటా నాయకులకు కూటమి పార్టీ నేతలు వత్తాసుపలుకుతున్నారు. సత్తివానిపాలెంలో లక్ష్మీసాగరం చెరువు కబ్జాకు కొందరు ప్రయత్నిస్తున్నారు. అయినా ఎవరూ అడ్డుకోకపోవడంపై గ్రామస్థులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. చినముషిడివాడ, పెందుర్తి, కోటనరవ...ప్రతిచోట ప్రభుత్వ సెలవు రోజులు వస్తే ఆక్రమణదారులు రెచ్చిపోతున్నారు. జిల్లా యంత్రాంగం స్పందించి ప్రభుత్వ స్థలాల ఆక్రమణను అడ్డుకునేందుకు టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుచేయాలని పలువురు కోరుతున్నారు.


గవర జగ్గయ్యపాలెంలో అక్రమ కట్టడాన్ని తూతూమంత్రంగా కొట్టి వదిలేసిన అధికారులు

తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్‌ల మొరాయింపు

... 3వ పేజీ తరువాయి

ఆగిపోతాయో తెలియని పరిస్థితి ఉంది. జాయింట్ క్రాస్‌లు మరమ్మతులకు గురవుతున్నాయి. మాడుగుల మండలం కేజీపురం వాహనానికి మరమ్మతులు చేయాల్సి ఉంది. అనకాపల్లిలోని ఒక వాహనం రిపేరు చేయించడానికి షోరూమ్‌లో పెట్టారు. ఈ బండి బ్యాటరీని చోడవరం వాహనానికి వేసి తిప్పుతున్నారు. జిల్లాలోని అన్ని వాహనాలకు బ్యాటరీలు, టైర్ల సమస్య ఉంది. వాహనాలు కదిలిన తరువాత గమ్యస్థానాలకు చేరే వరకు గ్యారెంటీ ఉండడం లేదు. ఈ విషయమై విశాఖ జిల్లా అధికారి చంద్రశేఖర్‌ని వివరణ కోరగా కొత్త బ్యాటరీలు, టైర్ల కోసం ప్రతిపాదనలు పంపామని, త్వరలోనే సమస్య పరిష్కరిస్తామని చెప్పారు.

వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

- ప్రధానోపాధ్యాయుల శిక్షణ శిబిరంలో డీఈవో అప్పారావునాయుడు


శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న డీఈవో అప్పారావునాయుడు

సబ్బవరం, జూలై 14 (ఆంధ్రజ్యోతి : ఉపాధ్యాయులు వృత్తి నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని జిల్లా విద్యా శాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు సూచించారు. సబ్బవరం దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వ విద్యాలయంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు జరుగుతున్న నాయకత్వ శిక్షణ శిబిరంలో సోమవారం ఆయన మాట్లాడారు. విద్యార్థులను ఉత్తమ ప్రమాణాలు కలిగిన వారిలా తీర్చిదిద్దాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పర్యవేక్షకులు డాక్టర్ శేషగిరి, ఎంఈవో-2 ఎం.జె.రవీంద్రబాబు, అసిస్టెంట్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ డాక్టర్ జయప్రకాశ్, ఉదయ్‌భాస్కర్ పాల్గొన్నారు.


అర్జీను చదువుతున్న డీఆర్‌వో సత్యనారాయణరావు


అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

నిర్ణీత సమయంలో అర్జీలను పరిష్కరించండి

- డీఆర్‌వో వై.సత్యనారాయణరావు

అనకాపల్లి కలెక్టరేట్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అందే అర్జీలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని డీఆర్‌వో వై.సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో డీఆర్‌వో సత్యనారాయణరావుతో పాటు ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ ఎస్‌వీఎస్.సుబ్బలక్ష్మి, హౌసింగ్ పీడీ వై.శ్రీనివాస్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం అధికారులను ఉద్దేశించి డీఆర్‌వో మాట్లాడుతూ ప్రజలు అందజేసిన అర్జీల పరిష్కారానికి అర్జీదారులతో నేరుగా మాట్లాడాలన్నారు. అర్జీలు పునరావృతం కాకుండా అధికారులు దృష్టి కేంద్రీకరించాలన్నారు. అర్జీల పరిష్కారానికి క్షేత్ర స్థాయిలో పర్యటనలు చేయాలన్నారు. అధికారులు తమ శాఖకు సంబంధించిన అర్జీల పరిష్కార పరిస్థితిని ప్రతి రోజూ పర్యవేక్షణ చేసి నిర్ణీత గడువులో పరిష్కరించాలన్నారు. పీజీఆర్ఎస్ ముగిసేసరికి 310 అర్జీలు అందాయని కలెక్టరేట్ విభాగం అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి జి.రామారావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం.హైమావతి, ఎక్సైజ్ శాఖ అధికారి వి.సుధీర్ పాల్గొన్నారు.

అర్జీదారులు సంతృప్తి చెందేలా పనిచేయండి

- జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా

అనకాపల్లి రూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): అర్జీదారులను సంతృప్తి చెందేలా పనిచేయాలని జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పౌరుల నుంచి ఆయన అర్జీలను స్వీకరించారు. వారితో నేరుగా మాట్లాడి బాధితుల గోడును ఆలకించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పోలీసు శాఖకు అందే ప్రతీ అర్జీని శ్రద్ధగా పరిశీలించాలని, వాటిని త్వరితగతిన పరిష్కరించి అర్జీదారులను సంతృప్తి పరచాలని సూచించారు. చట్ట పరిధిలో ఉన్న ప్రతీ అర్జీపై సంబంధిత పోలీస్ అధికారులు విచారణ చేపట్టాలన్నారు. అనంతరం అర్జీదారులు సమర్పించిన వినతులను సంబంధిత అధికారులకు బదలాయించారు. కాగా పీజీఆర్ఎస్‌కు 40 అర్జీలు అందగా, వీటిలో ఆస్తితగాదాలు, కుటుంబ కలహాలు, మోసాలు వంటి అంశాలపై ఎక్కువగా వచ్చాయని జిల్లా పోలీస్ కార్యాలయ విభాగం అధికారులు తెలిపారు.

అన్ని సబ్జెక్టులపై పట్టు సాధించాలి

- భారతీయులు ఎందులోనూ తక్కువ కాదు
- గోవా ఇంటర్నేషనల్ లా యూనివర్సిటీ ఉప కులపతి వెంకట్రావు


ప్రొఫెసర్ వెంకటరావును సత్కరిస్తున్న వీసీ సూర్యప్రకాశరావు

సబ్బవరం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): న్యాయ విద్యార్థులు ప్రతీ సబ్జెక్టుపైనా పట్టు సాధించాలని గోవా ఇంటర్నేషనల్ లా యూనివర్సిటీ ఉప కులపతి ప్రొఫెసర్ ఆర్.వెంకటరావు పేర్కొన్నారు. సబ్బవరంలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వ విద్యాలయంలో మూడు సంవత్సరాలు, ఐదు సంత్సరాల లా కోర్సుల్లో ప్రవేశం పొందిన నూతన విద్యార్థులకు సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఎదుటి వారు చెప్పేది శ్రద్ధగా వినగలిగినప్పుడే తమను తాము పరీక్షించుకుంటూ ఎదగవచ్చన్నారు. న్యాయ విద్యార్థులు నిపుణులతో అవగాహన పెంచుకుంటే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చన్నారు. భారతీయులు ప్రపంచంలో ఏ ఒక్కరికీ తక్కువ కాదన్నారు. నేటి యువత మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని తిఆయన సూచించారు. వర్సిటీలో ఉన్న అనేక సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. వర్సిటీలో సౌకర్యాలు, నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అంతకు ముందు వీసీ ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు మాట్లాడుతూ న్యాయ విద్యార్థికి సమాజం పట్ల పూర్తి అవగాహన ఉన్నప్పుడే చట్టాలను సరిగా అర్థం చేసుకోగలరన్నారు. అనంతరం ప్రొఫెసర్ వెంకటరావును వీసీ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ విశ్వచంద్రనాథ్ మాదాసు, అధ్యాపకులు పాల్గొన్నారు.

హౌసింగ్‌లో ఇన్‌చార్జుల పాలన

... 3వ పేజీ తరువాయి

పర్యవేక్షించాల్సి ఉంది. అయితే ప్రస్తుతం ఇంజనీరింగ్ అసిస్టెంట్లు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. అలాగే జిల్లాలో 9 మంది హౌసింగ్ డీఈలు ఉండాల్సి ఉండగా పాయకరావుపేట, యలమంచిలి, అనకాపల్లి డీఈలు మాత్రమే ఉన్నారు. వీరికి మిగతా మండలాల బాధ్యతలు అప్పగించారు. వీరు ఆయా మండలాలకు వెళ్లి రావడమే సరిపోతోందని, అందుకే బిల్లుల మంజూరులో జాప్యం జరుగుతోందని తెలిసింది. సుమారు ఇరవై రోజుల క్రితం చాలా మంది పదవీవిరమణ చేయడంతో ఈ పరిస్థితి వచ్చిందని సమాచారం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి జిల్లాలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని పలువురు కోరుతున్నారు.

పీఏసీఎస్‌లకు పర్సన్ ఇన్‌చార్జుల నియామకం...

... 3వ పేజీ తరువాయి

చైర్‌పర్సన్‌గా శీరంరెడ్డి వెంకటనాగచినబాబు, సభ్యులుగా అడిగర్ల రాంబాబు, గణిశెట్టి శంకరరావు, లంకెలపాలెం చైర్‌పర్సన్‌గా కోన తాతారావు, సభ్యులుగా సర్వసిద్ధి సన్యాసిరాజు, పైల అప్పలనాయుడు నియమితులయ్యారు. కె.కోటపాడు చైర్‌పర్సన్‌గా సిహెచ్.రామారావు, సభ్యులుగా డి.వెంకట్రావు, రుద్ర ఈశ్వరరావు, ఎం.అలమండ చైర్‌పర్సన్‌గా గొర్లి గోవింద, సభ్యులుగా యార్ల అప్పలనాయుడు, బొడ్డు వెంకట్రావు, ములకలపల్లి చైర్‌పర్సన్‌గా సీహెచ్.సన్యాసిరావు, సభ్యులుగా బి.సోమేశ్వరరావు, ఆర్.గోవిందరావు, వమ్మాలి చైర్‌పర్సన్‌గా ఎన్.సన్యాసిరావు, సభ్యులుగా సిహెచ్.ఆర్.నరసింగరావు, డి.సీతారాం, వీరనారాయణం చైర్‌పర్సన్ పి.వరహాలనాయుడు, సభ్యులుగా ఆర్.చిన్నోడు, దాడి కనక అప్పారావు, ఎంకే వల్లాపురం చైర్‌పర్సన్‌గా పిల్లానాయుడు, సభ్యులుగా ఎ.రాజుబాబు, జి.కొండలరావును నియమించింది.

పడకేసిన డయాలసిస్ యూనిట్లు

... 3వ పేజీ తరువాయి

నమోదు కావడంతో మరోచోట ఎన్టీఆర్ వైద్య సేవ కింద డయాలసిస్ సేవలు పొందలేని పరిస్థితి ఏర్పడినట్లు పేర్కొంటున్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న మెషీన్లు సహాయంతో రోజుకు పది నుంచి 15 మందికి మాత్రమే సేవలు అందిస్తున్నట్టు తెలుస్తోంది.

మూడు వారాల నుంచి...

నెఫ్రాలజీ విభాగంలో ఉన్న పది మెషీన్లలో రెండు, మూడు సాంకేతిక సమస్యలతో పనిచేయవు. మిగిలిన ఏడు, ఎనిమిదింటితో రోగులకు సేవలు అందిస్తుంటారు. అయితే, గతంలో ఎన్నడూ లేని విధంగా ఇప్పుడు ఒకేసారి ఐదు మెషీన్లు మూలకు చేరడంతో రోగులకు సేవలు అందించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మూడు వారాలుగా మెషీన్లు పనిచేయకపోయినా ఆస్పత్రి అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టలేదు. ఉన్నతాధికారులు సమస్యను పరిష్కరించేందుకు కృషిచేయాలని, దూర ప్రాంతాల నుంచి వచ్చే తమలాంటి వారికి ఇబ్బందులు లేకుండా చూడాలని రామారావు అనే రోగి సహాయకుడు పేర్కొన్నారు. ఉదయం నుంచి డయాలసిస్ కోసం నిరీక్షిస్తున్నామని, ఇంకా సమయం పడుతుందని చెబుతున్నారని వెల్లడించాడు.

కొత్తవి కొనుగోలు అవసరం

ఇకపోతే, పాడైన ఐదు మెషీన్లలో మూడు పూర్తిగా పనిచేయని స్థితికి చేరినట్టు తెలిసింది. మిగిలిన మెషీన్లు కూడా ఏళ్ల తరబడి నుంచి సేవలు అందిస్తున్నవి కావడంతో ఎప్పటికప్పుడు మొరాయిస్తున్నాయి.దీనివల్ల రోగులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. కొత్త డయాలసిస్ మెషీన్లు కొనుగోలు చేయడం ఒక్కటే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారమని వైద్యులు సూచిస్తున్నారు.

క్రైం... crime news

తాళ్లపాలెంలో క్వారీ లారీ బోల్తా

- నేలకొరిగిన రెండు విద్యుత్ స్తంభాలు


తాళ్లపాలెం వారపు సంత సమీపంలో బోల్తాపడిన క్వారీ లారీ

కశింకోట, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లపాలెం వారపు సంత మలుపు వద్ద క్వారీ రాయి తరలిస్తున్న లారీ సోమవారం అదుపుతప్పి బోల్తా పడింది. నర్సీపట్నం నుంచి నల్లరాయి ఓవర్ లోడ్ వేసుకొని వెళ్తుండగా అదుపుతప్పి చెరకు తోటలోకి దూసుకుపోయింది. ఈ క్రమంలో రోడ్డుకు పక్కనే ఉన్న విద్యుత్ 11కేవీ హెచ్‌టీ లైను, ఎల్టీ లైను స్తంభాలు నేలకొరిగాయి. దీంతో సోమవారం వ్యవసాయానికి విద్యుత్ సరఫరా లేదు. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డులో ప్రమాద సమయంలో రాకపోకలు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరి తీసుకున్నారు. డ్రైవర్‌కు ఎటువంటి ప్రాణాపాయం లేదు. సంఘటనా స్థలాన్ని పోలీసులు, ఏపీఈపీడీసీఎల్ అధికారులు పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన లారీ కారణంగా రూ.35 వేల నష్టం వాటిల్లిందని, ఈ మొత్తాన్ని యజమానుల నుంచి రాబడుతున్నామని ఏపీఈపీడీసీఎల్ ఏఈ నాయుడు తెలిపారు.

అనుమానాస్పదంగా వృద్ధురాలు మృతి

మునగపాక, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లపు ఆనందపురం గ్రామంలో ఓ వృద్ధురాలు అనుమానాస్పదంగా మృతి చెందినట్టు ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం... గ్రామంలో ఒంటరిగా జీవిస్తున్న కర్రి జోగులమ్మ (65)ను సోమవారం ఉదయం ఇంట్లో బల్బులు వెలిగి ఉండడంతో పరిసర వాసులు చూసి పిలిచారు. ఎంతకీ పలకకపోవడంతో వెళ్లి చూడగా కిందపడిపోయి ఉంది. జోగులమ్మకు రక్త బంధువులు ఎవరూ లేకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి వంద పడకలు ఆస్పత్రికి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు. రావిపాలెంలో ఉన్న జోగులమ్మ బంధువులకు సమాచారం ఇచ్చామని, ఫిర్యాదుకు అనుగుణంగా కేసు నమోదు చేశామని ఆయన చెప్పారు.

టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి


శ్రీనివాసరావు (ఫైల్)

నర్సీపట్నం అర్బన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెట్టుపల్లి శివాలయం సమీపంలో టిప్పర్ ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి రూరల్ ఎస్ఐ రామారావు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చెట్టుపల్లి గ్రామానికి చెందిన కలిమి శ్రీనివాసరావు (41) సోమవారం తెల్లవారుజామున గ్రామ శివారున ఉన్న శివాలయంలో స్వామివారి దర్శనానికి భార్య నూకరత్నంతో కలిసి వెళ్లాడు. అయితే కొబ్బరికాయ మరిచిపోవడంతో తిరిగి చెట్టుపల్లికి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా, నర్సీపట్నం నుంచి రోలుగుంట వైపు వెళుతున్న క్వారీ టిప్పర్ ఢీకొంది. దీంతో శ్రీనివాసరావు తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదం జరిగిన వెంటనే టిప్పర్‌ను వదిలేసి డ్రైవర్ పరారయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు సోదరుడు గోవింద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నటుట రూరల్ ఎస్ఐ రామారావు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా శ్రీనివాసరావుకు భార్య, ఇద్దరు పిల్లలు, తల్లి ఉన్నారు.

బలిఘట్టంలో చోరీ

నర్సీపట్నం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో బలిఘట్టం ప్రాంతంలోని ఓ ఇంట్లో బంగారం, నగదు చోరీకి గురైంది. సోమవారం పట్టణ సీఐ గోవిందరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. బలిఘట్టం ప్రాంతానికి చెందిన ఉప్పల జానకీదేవి ఇంటి దగ్గర ఫ్యాన్సీ షాపు నిర్వహిస్తున్నది. ఈ నెల 12వ తేదీన అర్ధ రాత్రి కుక్కలు అరుస్తుండగా జానకీదేవి ఇంట్లో నుంచి బయటకు వచ్చి స్పృహ కోల్పోయింది. ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులు నిద్ర లేపారు. ఆమె మెడలో రెండు తులాలు పుస్తెల తాడు, దుకాణంలోని కౌంటర్‌లో ఉంచిన రూ.23 వేలు నగదు చోరీకి గురయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

పైలా అవినాష్...రూ.11.5 లక్షలు

- రిక్కీ బుయ్ రూ.10.26 లక్షలు, గిరినాథ్‌రెడ్డి రూ.10.2 లక్షలు
- శ్రీకర్ భరత్, నితీష్‌కుమార్‌రెడ్డి, హనుమ విహారి, అశ్విన్ హెబ్బర్‌కు రూ.పదేసి లక్షలు
- రసవత్తరంగా ఏపీఎల్ సీజన్-4 ఆటగాళ్ల వేలం


పైలా అవినాష్

విశాఖపట్నం, స్పోర్ట్సు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) సీజన్-4 టోర్నీకి సంబంధించి సోమవారం నిర్వహించిన వేలంలో ఐకాన్ ఆటగాళ్లు మంచి ధర పలికారు. నగరానికి చెందిన పైలా అవినాష్ అత్యధికంగా రూ.11.5 లక్షలకు అమ్ముడుపోగా, తర్వాత స్థానంలో రికీ బుయ్ (రూ.10.26 లక్షలు) ఉన్నారు. ఇక టాప్ సీడ్ ఆటగాళ్లలో గిరినాథ్‌రెడ్డి రూ.10.2 లక్షలకు, టీమిండియా ఆటగాళ్లు నితీష్‌కుమార్‌రెడ్డి, శ్రీకర్ భరత్, హనుమ విహారితోపాటు ఇతర ఆటగాళ్లు తలో రూ.10 లక్షలకు అమ్ముడయ్యారు. నాలుగు కేటగిరీల నుంచి 520 మంది ఆటగాళ్లను వేలంలో ఉంచారు. జట్టు సభ్యుల కొనుగోలు కు రూ.45 లక్షలు కేటాయించేలా ఫ్రాంచైజర్‌కు పరిమితి విధించారు. టీమిండియా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన వారితోపాటు ఐపీఎల్ ఆడిన తొమ్మిది మంది ఆటగాళ్లను టాప్ సీడ్‌లో, గ్రేడ్-ఏలో 21 మందిని, గ్రేడ్-'బి'లో 112 మందిని, గ్రేడ్-'సి'లో 378 ఆటగాళ్లను వేలంలో ఉంచారు. ఆల్‌రౌండర్స్‌కు మంచి డిమాండ్ ఏర్పడింది. రాయల్స్ ఆఫ్ రాయలసీమ, భీమవరం బుల్స్, సింహాద్రి వైజాగ్ లయన్స్, తుంగభద్ర వారియర్స్, విజయవాడ సన్‌షైనర్స్, కాకినాడ కింగ్స్, అమరావతి రాయల్స్ జట్లకు చెందిన ఫ్రాంచైజర్లు వేలంలో పాల్గొన్నారు. వేలానికి ముందు టాప్ సీడ్‌లో ఉన్న తొమ్మిది మంది ఆటగాళ్లలో ఎనిమిది మందిని ఏడు జట్లు సొంతం (రిటైన్) చేసుకున్నాయి. రిటైన్ చేసుకున్న వారిలో హనుమ విహారి (రూ.10 లక్షలు, అమరావతి రాయల్స్), అశ్విన్ హెబ్బర్ (రూ.10 లక్షలు, విజయవాడ సన్‌షైనర్స్), రషీద్ (రూ.10 లక్షలు, తుంగభద్ర వారియర్స్), కేవీ శశికాంత్ (రూ.5 లక్షలు, తుంగభద్ర వారియర్స్), రికీ బుయ్ (రూ.10.26 లక్షలు, సింహాద్రి వైజాగ్ లయన్స్), శ్రీకర్ భరత్ (రూ.10 లక్షలు, కాకినాడ కింగ్స్), కె.నితీష్‌కుమార్‌రెడ్డి (రూ.10 లక్షలు, భీమవరం బుల్స్) ఉన్నారు.

పైలా అవినాష్....రూ.11.5 లక్షలు

గ్రేడ్-ఏలోని 21 మంది ఆటగాళ్లలో ఒకడైన నగర క్రికెటర్ పైలా అవినాష్‌ను రాయల్స్ ఆఫ్ రాయలసీమ జట్టు ఫ్రాంచైజర్లు రూ.11.5 లక్షలకు కొనుగోలు చేశారు. ఏపీఎల్ సీజన్-4లో అత్యధిక ధరకు అమ్ముడైన ఆటగాడిగా అవినాష్ రికార్డు నెలకొల్పాడు. ఆ తర్వాత స్థానంలో ఉన్న రిక్కీ బుయ్ (రూ.10.26 లక్షలు)తోపాటు రూ.10 లక్షలకు రిటైన్ చేసుకున్న నితీష్‌కుమార్‌రెడ్డి, శ్రీకర్ భరత్ కూడా విశాఖకు చెందినవారు కావడం గమనించదగ్గ విషయం.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	70.00
లైవ్ ధర	90.00
విత్ స్కిన్	150.00
స్కిన్ లెస్	160.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544